


మన బాలుడే...!

జేఎన్‌టీయూ విద్యార్థిగా జిల్లాతో అనుబంధం

గానగంధర్వుడికి పలుమార్లు సత్కారం

2008లో అనంతలో భారీ ఊరేగింపు

జిల్లాతో ఆత్మీయ అనుబంధం

నేడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి



ప్రత్యేక కథనం.. 6లో..

నామినేటెడ్ నైరాశ్యం..!

ఒక చైర్మన్.. నలుగురు డైరెక్టర్లు

తొలి జాబితాలో జిల్లాకు ఇంతే..!

సీడాప్ చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి

ఇక మలి జాబితాపైనే నాయకుల ఆశలు

అనంతపురం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవుల తొలి జాబితాలో జిల్లాకు ఒక చైర్మన్, నాలుగు డైరెక్టర్ పదవులు మాత్రమే లభించాయి. మాజీ ఎమ్మెల్సీ దీపక్ రెడ్డికి సీడాప్ చైర్మన్‌గా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ ముఖ్య నేతలు నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. మూన్నెళ్లుగా పదవుల పంపకాల కోసం ఎదురు చూస్తున్నారు. వందరోజుల పాలన పూర్తి కావడంతో ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. ఇదే సమయంలో నామినేటెడ్ పదవుల తొలి జాబితాను మంగళవారం ప్రభుత్వం విడుదల చేసింది. ఇది ఆశావాహులను నిర్ఘాంతపోయేలా చేసింది. జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, కొన్ని స్థానాల్లో సార్వత్రిక ఎన్నికల్లో మాజీలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలకు పోటీ చేసే అవకాశం దక్కలేదు. అలాంటి వారికి రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవుల్లో చోటు కల్పిస్తారని భావించారు. టీడీపీ అధినాయకత్వం పలుమార్లు ఇదే విషయం చెప్పింది. దీంతో తొలి జాబితాలోనే అవకాశం దక్కుతుందని ఆశావహులు ధీమాగా ఉన్నారు. తొలి జాబితాలో రాష్ట్ర వ్యాప్తంగా 20 విభాగాల నామినేటెడ్ (చైర్మన్) పోస్టులను ప్రకటించారు.



1)కేసీ హరి
2)వెంకటేశ్వర్లు
3)పోతుల లక్ష్మీనరసింహులు

అందులో జిల్లాకు కేవలం ఒక పదవి దక్కింది. మరో నాలుగు డైరెక్టర్ పోస్టులతో సరిపెట్టారు. మలి జాబితాలోనైనా ప్రాధాన్యం దక్కుతుందని ఆశావాహులు సర్దుకుంటున్నారు. తొలి జాబితా పార్టీ వర్గాలను తీవ్ర నిరాశకు గురిచేసిందని పార్టీ ముఖ్య, ద్వితీయశ్రేణి నాయకులు అంటున్నారు.

సీడాప్ చైర్మన్‌గా దీపక్‌రెడ్డి



రాష్ట్ర ఉపాధి కల్పన, సమాజాభివృద్ధి (ఎస్ఈఈడీఏపీ) చైర్మన్‌గా రాయదుర్గం నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ గునపాటి దీపక్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. 2021 శాసనమండలి ఎన్నికల్లో స్థానిక సంస్థల స్థానం నుంచి ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2020లో పరిపాలన వికేంద్రీకరణ, సీఆర్‌డీఏ రద్దు బిల్లులపై ఏర్పాటు చేసిన సెలెక్ట్ కమిటీలో దీపక్‌రెడ్డి సభ్యుడిగా ఉన్నారు. తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డికి దీపక్ రెడ్డి అల్లుడు. వైసీపీ పాలనలో జగన్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేశారు. ప్రభుత్వ తప్పిదాలను ఎప్పటికప్పుడు ఎత్తిచూపించారు. పార్టీ అధినేత చంద్రబాబునాయుడు, యువనేత నారా లోకేశ్‌కు సన్నిహితంగా మెలుగుతూ వస్తున్నారు. టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి హోదాలో నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రలో కీలకంగా పనిచేశారు. పాదయాత్ర ప్రారంభం నుంచి ముగిసేదాకా లోకేశ్ వెన్నంటే నడిచారు. పాదయాత్రలో తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించారు. నారా లోకేశ్ నుంచి ఆయన ప్రశంసలు అందుకున్నారు.

నలుగురు డైరెక్టర్లు



టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పోతుల లక్ష్మీనరసింహులును డైరెక్టర్ పోస్టు వరించింది. పార్టీ కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న ఆయనను పద్మశాలీ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించారు. రాయదుర్గం నియోజకవర్గానికి చెందిన పి.పురుషోత్తం కూడా ఇదే కార్పొరేషన్‌లో డైరెక్టర్ పదవి దక్కించుకున్నారు. ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా గుంతకల్లు నియోజకవర్గ కేంద్రానికి చెందిన కేసీ హరిని నియమించారు. పార్టీ ఆవిర్భావం కేసీ హరి కుటుంబం పార్టీ కోసం పనిచేస్తోంది. వారి సేవలను గుర్తించే కేసీ హరికి మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా అవకాశం కల్పించారు. ఏపీ షెడ్యూల్డ్ ట్రైబ్స్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కళ్యాణదుర్గానికి చెందిన వెంకటేశ్వర్లును నియమించారు.

రెవెన్యూ అవినీతికి రైతు బలి

● కలెక్టరేట్‌లో విషం తాగిన సూర్యనారాయణ ● ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

అనంతపురం టౌన్, సెప్టెంబరు 24: రెవెన్యూ అవినీతికి రైతు బలయ్యారు. తన వాటాగా వచ్చిన కాస్త పొలానికి పాస్‌బుక్ ఇవ్వమని అడిగితే.. అలవాటు ప్రకారం లంచం అడిగారు. అంత డబ్బు ఇచ్చుకోలేక తహసీల్దారు కార్యాలయానికి, కలెక్టర్ కార్యాలయానికి ఏడాదిపాటు తిరిగిన మట్టి మనిషి.. విసిగిపోయి విషం తాగాడు. కలెక్టరేట్ ఆవరణలో చావును పరిష్కారంగా ఎంచుకున్నాడు. గార్లదిన్నె మండలం క్రిష్ణాపురం గ్రామానికి చెందిన అన్నదాత సూర్యనారాయణ(54) చేసుకున్నది ఆత్మహత్యే అయినా.. ఇది వ్యవస్థ చేసిన హత్య అని చెప్పక తప్పదు. ఆకలి బాధలు, అప్పుల బాధలు, అధికారుల అవినీతి.. ఇలా ఏదో ఒక కారణంతో రైతులు రాలిపోవడం పరిపాటిగా మారింది.



క్యాజువాలిటీలో రైతు సూర్యనారాయణను ఇలా నేలపై కూర్చోబెట్టి చికిత్స చేశారు

● సూర్యనారాయణకు బూదేడు సర్వే నంబరు 135-1లో 1.54 ఎకరాల భూమి ఉంది. ముగ్గురు అన్నదమ్ముల భాగపరిష్కారం తరువాత ఆయనకు ఈ కాస్త పొలం వాటాగా వచ్చింది. మిగిలిన ఇద్దరు సోదరులకు పాస్‌బుక్‌లు మంజూరు చేసిన రెవెన్యూ అధికారులు.. సూర్యనారాయణకు మాత్రం ఇవ్వలేదు. డబ్బులు ఇస్తేగానీ పాస్‌బుక్ ఇప్పించేది లేదని వీఆర్వో మధు వేధించారని రైతు భార్య ఈశ్వరమ్మ కంటతడి పెట్టుకున్నారు. గార్లదిన్నె తహసీల్దారు కార్యాలయం చుట్టూ తన భర్త పలుమార్లు తిరిగారని, కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో సైతం మూడునాలుగుసార్లు అర్జీ ఇచ్చారని వాపోయింది.



ఆస్పత్రి మార్చురీలో రైతు సూర్యనారాయణ మృతదేహం

● చివరి ప్రయత్నంగా కలెక్టరేట్ ప్రజా ఫిర్యాదుల విభాగంలో సూర్యనారాయణ సోమవారం అర్జీ ఇచ్చాడు. ఆ తరువాత కలెక్టరేట్ ఆవరణలో ఓ చెట్టు కింద కూర్చున్నాడు. ఎన్నాళ్లు తిరిగినా తనకు న్యాయం జరగదని ఆవేదన చెందాడు. వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగాడు. గమనించిన పోలీసులు వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. విషయం బయటకు పొక్కకుండా సూర్యనారాయణను జిల్లా సర్వజన వైద్యశాలకు తరలించారు. ఆ తర్వాత సాయంత్రం 5 గంటల సమయంలో రైతు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. రైతు భార్య ఈశ్వరమ్మ తన బంధువులతో కలిసి ఆస్పత్రికి చేరుకున్నారు. అప్పటికే సూర్యనారాయణ చావుబతుకుల మధ్య ఉన్నారు. చికిత్సపొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందాడు.

● రెవెన్యూ అధికారుల అవినీతి కారణంగానే తన భర్త ప్రాణాలు కోల్పోయాడని, తమకు న్యాయం చేయాలని ఈశ్వరమ్మ డిమాండ్ చేసింది. వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని, అప్పటి వరకు పోస్టుమార్టం చేయడానికి వీలులేదని రైతు బంధువులు ఆగ్రహం వ్యక్తం చేసారు. ఆర్డీఓ వసంతబాబు ఆస్పత్రికి వచ్చి బాధితులతో మాట్లాడారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో బాధితులు శాంతించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆర్డీఓను కలెక్టర్ ఆదేశించారని తెలిసింది.



రైతు భార్య ఈశ్వరమ్మ

రాములోరి రథానికి నిప్పు

వర్గపోరే కారణమని నిర్ధారణ

పోలీసుల అదుపులో ముగ్గురు



దగ్ధమైన రథం



హనకనహాళ్‌లో వివరాలు ఆరాతీస్తున్న కలెక్టర్, ఎస్పీ

కణేకల్లు/రాయదుర్గం సెప్టెంబరు 24: మండల పరిధిలోని హనకనహాళ్ రామాలయ ఉత్సవ రథానికి దుండగులు నిప్పు పెట్టారు. సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకున్న ఈ ఘటన జిల్లాలో కలకలం రేపింది. గ్రామానికి చెందిన మూలింటి ఎర్రిస్వామి రెడ్డి కుటుంబ సభ్యులు రూ.19 లక్షలు వెచ్చించి మూడేళ్ల క్రితం రథాన్ని తయారు చేయించి పురాతన రామాలయానికి సమర్పించారు. రథాన్ని భద్రపరిచేందుకు ఆలయ ప్రాంగణంలో రేకుల షెడ్డు ఏర్పాటు చేశారు. ఉత్సవాల సమయంలో రథాన్ని గ్రామంలో ఊరేగించి, యథాస్థానంలో ఉంచుతారు. రథం షెడ్డులో సోమవారం అర్ధరాత్రి మంటలు చెలరేగడాన్ని గ్రామస్థులు గుర్తించారు. రథానికి నిప్పు పెట్టారని కేకలు వేయడంతో అందరూ మేల్కొని మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. షెడ్డు తాళాలను పగులగొట్టి రథంపై పెట్రోల్ పోసి నిప్పు అంటించినట్లు గుర్తించారు. మంటలను ఆర్పేలోగా రథం చక్రాల మధ్య భాగం పాక్షికంగా దహనమైంది.

వైరి వర్గం పనే..?

హనకనహాళ్‌లో శ్రీరామ నవమికి స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఎద్దుల బండిలో ఊరేగించారు. 2022 మార్చి 10న గ్రామానికి చెందిన ఎర్రిస్వామిరెడ్డి, హనుమంతరెడ్డి, గోపాల్‌రెడ్డి, రామాంజినేయులురెడ్డి రూ.19 లక్షలతో రథాన్ని తయారు చేయించారు. అప్పటి నుంచి సీతారామ, లక్ష్మణ, ఆంజనేయుల ఉత్సవ విగ్రహాలను రథంపైనే ఊరేగిస్తున్నారు. రెడ్డి సామాజికవర్గానికే చెందిన కొందరు దీన్ని జీర్ణించుకోలేకపోయారు. రథాన్ని ఆలయం వద్ద పెట్టవద్దని, సొంత స్థలంలో పెట్టుకోవాలని గతంలో ఎర్రిస్వామిరెడ్డి కుటుంబ సభ్యులకు సూచించారు. కానీ గ్రామస్థుల సహకారంతో ఎర్రిస్వామిరెడ్డి కుటుంబం ఆలయ ఆవరణలోనే షెడ్డు వేసి రథాన్ని అక్కడే ఉంచుతోంది. అక్కసు తట్టుకోలేక రథానికి నిప్పు పెట్టింది ఎర్రిస్వామిరెడ్డి వైరి వర్గమేనని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. ఇప్పటికే ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. దేవదాయ శాఖ ఈఓ నరసింహారెడ్డి ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు, రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, కణేకల్లు ఎస్ఐ నాగమధు, ఆర్డీఓ సుస్మితరాణి, తహసీల్దారు ఫణికుమార్ గ్రామంలో విచారణ చేపట్టారు.



రథం దహనంపై విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ

సీఎం సీరియస్

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ ఘటనను తీవ్రంగా పరిగణించారు. బాధ్యులను వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమగ్ర నివేదిక సమర్పించాలని జిల్లా అధికారులకు ఆదేశించారు. కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్ గ్రామాన్ని మంగళవారం సందర్శించారు. డాగ్‌స్క్వాడ్‌ను పిలిపించి దర్యాప్తు చేయించారు. రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. నిప్పు పెట్టినవారిని వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

ఈ ఘటనతో కులమతాలకు సంబంధం లేదని, వర్గపోరు కారణంగానే జరిగిందని ఎస్పీ జగదీష్ అన్నారు. పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణను సీఎంఓ ఆదేశించిందని, సమాచారాన్ని అందించామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా కేసు దర్యాప్తు వేగవంతం చేయాలని ఎస్పీని కోరినట్లు ఆయన తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. దోషులను త్వరితగతిన పట్టుకోవాలని, ఈలోగా ఎలాంటి దుష్ప్రచారాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఏంది డాక్టర్ ఇదీ..?

గర్భసంచి ఆపరేషన్‌కు వెళితే.. మూత్రనాళాన్ని తొలగించాడు

ఆస్పత్రి ఎదుట బాధితుల ఆందోళన



లావణ్య ఆస్పత్రి ఎదుట ఆటోలో కూర్చున్న రాధమ్మ

అనంతపురం టౌన్, సెప్టెంబరు 24: గర్భసంచి ఆపరేషన్‌కు వచ్చిన మహిళకు మూత్రనాళాన్ని తొలగించాడు డాక్టర్ రమణ నాయక్. జిల్లా సర్వజన వైద్యశాలలో జనరల్ సర్జన్‌గా పనిచేస్తున్న ఈయన.. నగరంలో లావణ్య ప్రైవేట్ ఆస్పత్రిని నిర్వహిస్తున్నారు. కూడేరు మండలం హంసాయపల్లికి చెందిన రాధమ్మ అనారోగ్యంతో ఆయన వద్దకు వచ్చారు. గర్భసంచి సమస్య ఉందని, తన ప్రైవేటు ఆస్పత్రికి వస్తే ఆపరేషన్ చేస్తానని సూచించారు. కుటుంబ సభ్యులు ఆమెను ఈ నెల 9న లావణ్య ఆస్పత్రిలో చేర్పించారు. అదే రోజు డాక్టర్ రమణ నాయక్ ఆపరేషన్ చేసి.. డిశ్చార్జి చేశారు. మరుసటి రోజు వరకు ఆమెకు మూత్రం రాకపోవడంతో తిరిగి లావణ్య ఆస్పత్రికి తీసుకొచ్చారు. తప్పు జరిగిందని గ్రహించిన డాక్టర్ రమణ నాయక్.. వారికి విషయం చెప్పకుండా ప్రభుత్వ ఆస్పత్రికి పంపించారు. అక్కడ డాక్టర్లు పట్టించుకోకపోవడంతో కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసికెళ్లారు. అక్కడ కూడా ఎవరూ పట్టించుకోకపోవడంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటికే కిడ్నీలు వాపు వచ్చినట్లు గుర్తించిన వైద్యులు.. డయాలసిస్ చేశారు. అక్కడ కోలుకున్న తర్వాత తిరిగి అనంతపురం వచ్చి.. మరో ప్రైవేట్ కిడ్నీ ఆస్పత్రిలో చేర్పించారు. ఆమెకు స్కానింగ్ చేసిన వైద్యులు.. మూత్రనాళాన్ని తొలగించారని, అందుకే సమస్య వచ్చిందని గుర్తించారు. ఆపరేషన్ చేసి కొంతవరకూ సమస్యను పరిష్కరించారు. మూడు నెలల తరువాత మరో ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులు మంగళవారం రాత్రి లావణ్య ఆస్పత్రి వద్దకు రాధమ్మను తీసుకువచ్చి ఆందోళనకు దిగారు. పోలీసులు వచ్చి సర్దిచెప్పినా వినుకోలేదు. డాక్టర్ రమణ నాయక్‌ను పిలిపించాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యంగా ఆపరేషన్ చేసిన డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని అన్నారు. డాక్టర్ ఆ ప్రాంతానికి రాలేదు. వివరణ కోరేందుకు 'ఆంధ్రజ్యోతి' ఫోన్ చేసినా అందుబాటులోకి రాలేదు. ఈ ఘటనపై బాధితులు కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ జరుపుతున్నామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి తెలిపారు.



లావణ్య ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

పాతవారికే పట్టం

పంచాయతీ బదిలీల్లో మాయ.. వైసీపీ బాధితులకు మరోమారు అన్యాయం

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 24: ప్రభుత్వం మారడంతో పంచాయతీ బదిలీలలో న్యాయం జరుగుతుందని భావించినవారికి చుక్కెదురైంది. గత ప్రభుత్వంలో ప్రాధాన్యం పొందినవారికి మరోమారు పెద్ద పీట వేశారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఎందుకొచ్చిన తలనొప్పి అని బదిలీల వ్యవహారంలో కొందరు అధికారులు జోక్యం చేసుకోలేదు. స్థానిక నాయకుల సిఫార్సులను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపోయారు. దీంతో తెలిసిన నాయకులను పట్టుకుని సిఫార్సు లేఖలతో కొందరు ఆప్షన్ ఫామ్స్ ఇచ్చుకున్నారు. వైసీపీ హయాంలో వనవాసం వెళ్లినంత దూరం వెళ్లినవారు తమకు దగ్గరి స్థానాలు దొరుకుతాయని భావించారు. డీపీఓలో తయారు చేసిన ప్రపోజల్స్‌ను జిల్లా ఉన్నతాధికారులు తిరస్కరించారు. ఈ క్రమంలో ఎలాంటి సిఫార్సులు లేనివారికి (వైసీపీ హయాంలో ప్రాధాన్యం పొందిన) మళ్లీ మంచి స్థానాలు దొరికాయి. ఈ పరిస్థితిని చూసి బాధితులు ఆవేదన చెందుతున్నారు.



ఇదీ పరిస్థితి..

టీడీపీ హయాంలో నారాయణపురం పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన అశ్వత్థమనాయుడును వైసీపీ అధికారంలోకి రాగానే ఏకంగా చిలమత్తూరుకు బదిలీ చేశారు. రెండేళ్లపాటు అక్కడే విధులు నిర్వహించిన ఆయన.. గుడ్డిలో మెల్ల అన్న చందంగా నార్పలకు వచ్చారు. ప్రభుత్వం మారడంతో అనంతపురం రూరల్ మండలంలో ఏదో ఒక క్లస్టర్ పంచాయతీ దక్కుతుందని భావించారు. కానీ యాడికి పంచాయతీకి బదిలీ చేశారు. ఇదే తరహాలో మరికొందరికి చేదు అనుభవం ఎదురైంది. ఇక అప్పట్లో ఏలినవారికి మరోమారు ప్రాధాన్యం దక్కింది. మహమద్ రఫీని ఆకుతోటపల్లి నుంచి రాచానపల్లికి బదిలీ చేశారు. రవిచంద్రను గార్లదిన్నె నుంచి తాటిచెర్లకు బదిలీ చేశారు. చంద్రశేఖర్ పామిడి నుంచి గార్లదిన్నెకు వచ్చారు. ఇదయతుల్లాను కురుగుంట నుంచి కక్కలపల్లి క్లస్టర్‌కు బదిలీచేసి, అదనపు బాధ్యతలు అప్పగించారు. చంద్రశేఖర్ ఆరు నెలలకు ఒక పంచాయతీ మారుతూ.. జిల్లా కేంద్రం పరిసరప్రాంతాల్లోనే కొనసాగుతున్నారు. ఆయన బుక్కరాయసముద్రం నుంచి పామిడికి, అక్కడి నుంచి గార్లదిన్నెకు వచ్చారు.

వైసీపీ మాయగాడు

నకిలీ పాస్ పుస్తకాలతో మోసాలు.. భార్యతో కలిసి బ్యాంకు రుణాలు



ఓబులేసు పొందిన నకిలీ పాస్ బుక్

ఆర్డీఓకు గ్రామ సర్పంచ్ చేసిన ఫిర్యాదు కాపీ



విడపనకల్లు, సెప్టెంబరు 24: మండల పరిధిలోని చీకలగురికి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు ఎం.ఓబులేసు అదే గ్రామానికి చెందిన ఐదుగురు సోదరుల భూమికి నకిలీ పాసు పుస్తకాలను పొందాడు. తనకు ఎక్కడా సెంటు భూమి లేకున్నా మాయ చేశాడు. గ్రామానికి చెందిన హెచ్.వీరభద్ర, హెచ్.వన్నప్ప, ఎం.శ్రీనివాసులు, హెచ్.బండెయ్య బి.వన్నూరప్ప సోదరులకు సర్వే నంబరు 145 ఏబీలో 2.74 ఎకరాల పొలం ఉంది. దీన్ని ఐదుగురు సోదరులు సమంగా విభజించుకుని పట్టాలు పొందారు. ఇదే భూమిని ఓబులేసు తన బంధువు.. వీఆర్వో మధు సాయంతో తన పేరిట 2020లో పట్టా నంబరు 380 కింద నకిలీ పాసు పుస్తకాన్ని సంపాదించారు. ఇదే గ్రామానికి చెందిన కురుబ మల్లికార్జునకు సర్వే నంబరు 60-బిలో 4.25 ఎకరాలు భూమి ఉంది. దీనికి కూడా మీనుగ చౌడమ్మ (భర్త ఎం.ఓబులేసు) పేరిట నకిలీ పాసుపుస్తకాన్ని పొందాడు. ఈ రెండు పాసుపుస్తకాల ఆధారంగా పాల్తూరు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో దంపతులు ఇద్దరూ రూ.4 లక్షల రుణాలు పొందారు. రుణాలు రికవరీ కోసం పాల్తూరు బ్యాంకు అధికారులు చీకలగురికి చేరుకుని వివారాలు విచారించారు. దీంతో ఓబులేసు దంపతులకు సెంటు భూమి కూడా లేదని, అవి నకిలీ పాసుపుస్తకాలని తేలింది. ఆన్‌లైన్‌లో అసలైన భూ యజమానుల పేర్లు రావటంతో బ్యాంకు అధికారులు ఖంగుతిన్నారు. ఈ వ్యవహారంపై చీకలగురికి సర్పంచ్ కొత్తపల్లి పద్మావతి ఆర్డీఓ, తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్

30న చలో కలెక్టరేట్‌కు పిలుపు

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 24: జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ శాఖలు, సంస్థలలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఆప్కాస్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న చేపట్టే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా కార్యాలయంలో మంగళవారం చలో కలెక్టరేట్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వరంగం సంస్థలో పనిచేస్తున్న నాన్ రెగ్యులర్ ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు, సౌకర్యాలు అమలు చేయడంతోపాటు రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత తొలగించిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా కక్షపూరితంగా వ్యవహరించే స్థానిక నాయకులను కట్టడి చేయాలని కోరారు. ఈ డిమాండ్లన్నింటి పరిష్కారంకోసం ఈనెల 30వ తేదీన చేపట్టే చలో కలెక్టరేట్ కార్యక్రమంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఆప్కాస్ ఉద్యోగులందరూ పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, ఉపాధ్యక్షుడు రామాంజనేయులు, నగర అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, వెంకటనారాయణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పట్టు రైతులకు రాయితీలు: జేడీఏ

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 24: రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను పట్టు రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ సూచించారు. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా పట్టు పరిశ్రమశాఖ ఎస్‌ఓ ఓబులేసు ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. రేషం షెడ్డు నిర్మాణానికి ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.4.05 లక్షలు, ఇతర రైతులకు రూ.3.37 లక్షల రాయితీని ప్రభుత్వం ఇస్తోందని తెలిపారు. మొక్కలు నాటడానికి ఎకరానికి రూ.27 వేల వరకు, ఉపాధి హామీ పథకం కింద పనులు చేయడానికి రూ.63వేల వరకూ ఇస్తోందని తెలిపారు. అనంతరం కౌలు రైతులకు ధ్రువ పత్రాలను అందజేశారు.



రైతులకు కౌలుపత్రాలను అందజేస్తున్న జేడీఏ, ఎస్‌ఓ

రైలు నుంచి జారి పడి యువకుడి మృతి

గుత్తి, సెప్టెంబరు 24: మండలంలోని తురకపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో మంగళవారం రైల్లో నుంచి జారిపడి కర్ణాటక రాష్ట్రానికి చెందిన మల్లికార్జున(28) మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు. యాదగిర్ జిల్లా కనేకల్లుకు చెందిన మల్లికార్జున భార్య, పిల్లలతో కలిసి బెంగళూరులో ఉంటూ బేల్దారి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇటీవల స్వగ్రామంలో బంధువు చనిపోవడంతో వెళ్లాడు. అక్కడ దినాలు పూర్తి చేసుకుని చెల్లెలతో మాట్లాడి, బెంగళూరుకు నాందేడ్ ఎక్స్‌ప్రెస్ రైలులో బయల్దేరాడు. జనరల్ బోగీలో ప్రయాణిస్తుండగా తురకపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో మలుపు వద్ద ప్రమాదవశాత్తు రైల్లో నుంచి జారి కింద పడి మృతి చెందాడు. గుత్తి సీఐ వెంకటేశ్వర్లు, తన సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. జీఆర్పీ ఎస్ఐ నాగప్ప మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఒక కూతురు ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్‌లో నగదు అపహరణ

గుంతకల్లు టౌన్, సెప్టెంబరు 24: స్థానిక పాత బస్టాండ్ వద్ద ద్విచక్ర వాహనంలో ఉంచిన నగదు మంగళవారం చోరీ అయ్యింది. పాతబస్టాండ్‌లోని హైదరాబాదు బిర్యానీ హోటల్ ఎదురుగా చంగీజ్‌ఖాన్ జిమ్ నిర్వహిస్తున్నాడు. మధ్యాహ్నం కెనరా బ్యాంక్‌లో రూ.2.90లక్షలు డ్రా చేసుకుని ద్విచక్రవాహనంలో ఉన్న బ్యాగ్‌లో పెట్టుకుని జిమ్ వద్దకు వచ్చాడు. అక్కడ పని చూసుకుని వెళ్లి ద్విచక్రవాహనంలో డబ్బు చూడగా కనిపించలేదు. ఈ విషయాన్ని అతను టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో అతను ఫిర్యాదు చేశాడు. విచారణ చేస్తున్నట్లు టూటౌన్ సీఐ ఏపీ మస్తాన్ తెలిపారు.



మన బాలుడే..!

సినీ పరిశ్రమలో మూడు తరాలకు గాత్ర దానం చేసిన శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం గతించి నాలుగేళ్లు అయినా ఆయన పాడిన పాటలు అజరామరం. బుధవారం ఆయన వర్ధంతి. అనంత జేఎన్‌టీయూ విద్యార్థిగా, గాన గంధర్వుడిగా ఆయనకు జిల్లాతో మంచి అనుబంధం ఉంది.

- జేఎన్‌టీయూ విద్యార్థిగా జిల్లాతో అనుబంధం
- గాన గంధర్వుడిగా పలుమార్లు సత్కారం
- 2008లో అనంతవాసులచే భారీ ఊరేగింపు
- అనంతతో ఆత్మీయ అనుబంధం
- నేడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి

ఆయన గాత్రంలో
అక్షరాలు అలలై పొంగుతాయి
పాట గజ్జెకట్టి ఆడుతుంది.
సరిగమలు సంతసంతో
మురిసి నర్తిస్తాయి.
అమృతతుల్యమైన ఆ కరంలో
గోదావరి కూడా వేదంలా ఘోషిస్తుంది.
పాటల జగతి
పగలే వెన్నెలాయే అంటూ పరవశిస్తుంది.
మాటేరాని చిన్నది సైతం
ఓ పాపా లాలీ అంటూ లాలిస్తుంది
'బాలు' చంద్రుడిలా ఉదయించి
నవమినాటి వెన్నెలలా అగుపించి
ఆకుచాటు పిందెను చూపించి
నిండు ఆకాశమంత సంగీతానికి
పున్నమి వెన్నెలతో
స్వరాభిషేకం చేసిన గాన గంధర్వుడు ఆయన
శంకరుడికి నాగాభరణంలా
సంగీత జగత్తులో పండితులకు
ఆరాధ్యుడయ్యాడు
ఆగిపోని కాలానికి స్వాగతం అంటూ
పాటకు ప్రాణ ప్రతిష్ట చేసిన ఆ గళం
కరోనా కాటుకు మూగబోయింది.
సినీ సంగీతం చిన్నబోయింది.
తన పెన్నిధిలేదని పాట
మాటరాని మౌనమిది అంటూ రోదించింది.
గత గాత్రాన్ని నెమరు
వేసుకుంటూ సాంత్వన పొందింది.



త్యాగరాజ సంగీత సభ స్వర్ణోత్సవాల్లో పాల్గొన్న ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 24: సినీ సంగీత చరిత్రలో తనకంటూ ఓ పేజీని లిఖించుకున్న గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం. అన్ని భాషలలో కలిపి 40వేలకు పైగా పాటలు పాడి భేష్ అనిపించుకున్న ఘనాపాటి ఆయన. కళామతల్లి ముద్దు బిడ్డగా ఆయన సంగీత ప్రయాణం శిఖర సమానం. నాలుగు దశాబ్దాలపాటు తన గానమాధుర్యంతో పాటల ప్రేమికులను ఓలలాడించిన ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు అనంతపురం జిల్లాతో విడదీయరాని అనుబంధం ఉంది. విద్యార్థిదశలో 1962లో అప్పట్లో నాగార్జున యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల(ప్రస్తుత జేఎన్‌టీయూ)లో మెకానికల్ ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదివారు. తర్వాత నెల్లూరుకు వెళ్లిపోయారు. ఇదే జేఎన్‌టీయూ నుంచి నాలుగో డాక్టరేట్‌ను సైతం ఎస్పీ బాలు అందుకున్నారు. జేఎన్‌టీయూలో చదువుకుంటున్న సమయంలోనే గూడూరులో కాళిదాసు కళానికేతన్ సంస్థ నిర్వహించిన లలిత సంగీత పోటీల్లో బాలు రెండో బహుమతిని అందుకున్నారు. ఆ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతగా వ్యవహరించిన ప్రఖ్యాత గాయని ఎస్.జానకి.. ఎస్పీ బాలును పిలిచి 'నీకు మంచి భవిష్యత్తు ఉంది. మద్రాస్ వచ్చెయ్' అని సూచించారు. అతడి ప్రతిభకు ఆమె దీవెనలు తోడవడంతో అనతికాలంలోనే సినీ సంగత ప్రపంచలోకి అడుగుపెట్టి స్థిరపడ్డారు. అనంతరం కాలంలో 1970లో కళాశాల వార్షికోత్సవానికి వచ్చిన ఆయన దివినుంచి భువికి దిగివచ్చి అనే పాటను పాడి అందరి మన్ననలు పొందారు. 2008 జూన్ 29న త్యాగరాజ సంగీతసభ స్వర్ణోత్సవాల్లో పాల్గొనేందుకు అనంతపురం వచ్చారు. అప్పట్లో త్యాగరాజ సభ స్వర్ణోత్సవాల నిర్వాహకుడు దాసరి హరిశ్చంద్ర రామ ఆధ్వర్యంలో ఎస్పీ బాలును నగరంలో ఊరేగించడంతోపాటు సంగీత సభ తరపున బంగారు ఉంగరాన్ని బహూకరించి ఘనంగా సత్కరించారు. ఇదే కార్యక్రమంలో పడమటి సంధ్యారాగం సినిమాలోని 'పిబరే రామరసం' పాటను ఆలపించి సంగీతాభిమానులను అలరించారు. 2014 ఆగస్టులో జిల్లాకేంద్రంలోని ఓ కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన పాడుతా తీయగా కార్యక్రమానికి ఎస్పీ బాలు హాజరై తన గాత్రంతో సంగీతాభిమానులను రంజింపజేశారు. తర్వాత 2015 జనవరి 11న జేఎన్‌టీయూ ఆవరణలో నిర్వహించిన స్వరాభిషేకం కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చారు. ఈ సందర్భంగా తన విద్యార్థిదశలో అనంతపురంలోని జేఎన్‌టీయూలో గడిపిన కాలాన్ని గుర్తుచేసుకుని వీక్షకులతో ఆ మధురజ్ఞాపకాలను పంచుకున్నారు. ఇలా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు అనంత జిల్లాతో అమూల్యమైన అనుబంధం ఉంది.



అనంతలో ఎస్పీ బాలు ఊరేగింపు (ఫైల్)


నేటితరం గాయకులకు ఆదర్శం

- హరిశ్చంద్రరామ, త్యాగరాజ సంగీత సభ స్వర్ణోత్సవాల నిర్వహణ కమిటీ చైర్మన్



2008లో త్యాగరాజ సంగీతసభకు సంబంధించి వారం రోజులపాటు గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించాము. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం హాజరయ్యారు. అందరితో కలివిడిగా గడిపారు. నేటితరం గాయకులకు ఎస్పీ బాలు ఆదర్శం. పెద్దదిక్కుగా సంగీతంలో ఎన్నో సూచనలు, సలహాలందించేవారు.

మరపురాని స్వరం ఎస్పీ బాలు : ఏలూరు యంగన్న, జనప్రియ కవి



1996 జనవరిలో నెల్లూరు సెంటర్‌లో విజయవాడ ఆకాశవాణి కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కవి సమ్మేళనంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంతోపాటు నేను పాల్గొన్నాను. ఆ సమయంలో నేను పద్యం పాడిన తీరును గమనించి, ఎస్పీ బాలు నాతో కరచాలనం చేస్తూ నన్ను అభినందించడం నా జీవితంలో మరుపురాని మధుర జ్ఞాపకం. తెలుగువారికి ఆయన కమ్మని స్వరం. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం భౌతికంగా దూరమై నాలుగు సంవత్సరాలవుతున్నా ఆయన స్వరం ప్రజల మదిలో వినిపిస్తూనే ఉంది. జేఎన్‌టీయూఏ ఉద్దీపన గీతంను నేను రాయగా ఎస్పీ బాలు గానం చేయడం అదృష్టంగా భావిస్తున్నాను.

ఆదరణ చూపేవారు: ఓబులదాస్, అధ్యక్షుడు, పాతపాటల ప్రేమికుల కల్చరల్ అసోసియేషన్



కళాకారులన్నా... కళాభిమానులన్నా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఎంతో ఆదరణ చూపేవారు. 2017 డిసెంబరు 24న హైదరాబాద్‌లో సారథి స్టుడియోస్‌లో పాతపాటల ప్రేమికుల కల్చరల్ అసోసియేషన్‌ను బాలు చేతులమీదుగా ప్రారంభించారు. అదే సందర్భంగా అంధురాలైన లక్ష్మీ అనే గాయకురాలికి బాలు చేతులమీదుగా రూ.50వేలు ఆర్థికసాయం అందజేశారు. చిన్నప్పటినుంచి ఆయన పాటలను వింటున్నాం. మా అసోసియేషన్ కార్యక్రమాల నేపథ్యంలో మూడుసార్లు ఆయనను కలిసాం. ఎప్పుడు కలిసినా చాలా ఆప్యాయంగా మాట్లాడించేవారు.

ఉద్యోగుల బదిలీల్లో గందరగోళం

డీఆర్‌డీఏ-వెలుగు ఏసీ పోస్టులు ఖాళీ

డీపీఎం, ఏపీఎం, సీసీల బదిలీలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 24 : డీఆర్‌డీఏ-వెలుగు ఉద్యోగుల బదిలీల్లో గందరగోళం నెలకొంది. క్లస్టర్ ఏరియా కోఆర్డినేటర్ల పోస్టులను ఖాళీగా ఉంచి అక్కడ పనిచేస్తున్న ఏసీలను పీడీ కార్యాలయానికి బదిలీ చేశారు. రాయదుర్గం క్లస్టర్ ఏసీ గంగాధర్ సుమారు ఏడేళ్లుగా అక్కడే పనిచేస్తున్నారు. ప్రస్తుతం బదిలీల్లో పీడీ కార్యాలయానికి పంపారు. తిరిగి ఆయనకే రాయదుర్గం ఏసీ ఇన్‌చార్జి ఇవ్వాలని చూస్తున్నారు. ఇక కళ్యాణదుర్గం ఏసీ రాధారాణి సుమారు ఐదేళ్లకు పైగా అక్కడే పనిచేస్తున్నారు. ప్రస్తుత బదిలీల్లో పీడీ కార్యాలయానికి వేశారు. తిరిగి కళ్యాణదుర్గం ఏసీ ఇన్‌చార్జి ఇవ్వాలని యత్నిస్తున్నారు. మరో డీపీఎం రవీంద్రబాబు ఉరవకొండ ఏసీగా పనిచేస్తూ, పీడీ కార్యాలయంలో ఇన్‌చార్జిగా చేస్తున్నారు. తాజా బదిలీల్లో పీడీ కార్యాలయానికి పంపినా ఎప్పటినుంచో ఇక్కడే పనిచేస్తున్నారు. డీపీఎం ఎంకే సత్యనారాయణ చేయూత ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారు. ఆయన్ను ధర్మవరం ఏసీగా బదిలీ చేశారు. తాడిపత్రి క్లస్టర్ ఏసీగా పనిచేస్తున్న రాజ్యలక్ష్మిని పామిడి క్లస్టర్‌కు బదిలీ చేశారు. అనంతపురం జిల్లాలో నలుగురు డీపీఎంలు, ఏపీఎంలు 32 మందిని, సీసీలు 60మంది బదిలీచేశారు. బదిలీలు చేసినా వాళ్లే...చేయకపోయినా వాళ్లే అనే చందంగా మారింది. జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఏ-వెలుగు పీడీ కార్యాలయంలో సుమారు నాలుగైదేళ్లుగా పనిచేస్తున్న డీపీఎంలు రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ ఏరియా కోఆర్డినేటర్లు బదిలీ పేరుతో పీడీ కార్యాలయానికి పంపారు. పీడీ కార్యాలయంలో ఇదివరకు పనిచేసే సబ్జెక్టులను తీసుకుని తిరిగి అదే క్లస్టర్లకు ఇన్‌చార్జిలుగా కొనసాగాలను యత్నిస్తున్నట్లు సమాచారం. ఏపీఎంలలో కొందరిని ఇన్‌చార్జి ఏసీలుగా నియమించాలనే ఉద్దేశ్యంతో ఆయా క్లస్టర్లలోనే ఉంచారు. ఆరుగురు ఏపీఎంలను ఇక్కడ నుంచి శ్రీసత్యసాయి జిల్లాకు పంపగా, అక్కడి నుంచి ఇక్కడికి ఆరుగురు ఏపీఎంలను బదిలీ చేశారు. మొత్తంగా డీపీఎంల నుంచి ఏపీఎంలు, సీసీల వరకు బదిలీలు అంతా గందరగోళమే. ప్రస్తుతం ఎఫ్‌ఏసీ పీడీగా ఉన్న ఓబులమ్మను కడప జడ్పీ సీఈఓగా బదిలీ చేశారు. గత మూడు నెలలుగా డీఆర్‌డీఏకు రెగ్యులర్ పీడీ లేకపోవడం కూడా ఉద్యోగుల బదిలీల గందర గోళానికి దారితీస్తోంది. మరి రెగ్యులర్ పీడీ ఎవరు, ఎప్పుడు వస్తారని ఆ శాఖలోని ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు.

బీటెక్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 24: ఎస్కేయూ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ సీఎస్ఈ, ఈసీఈ, సివిల్, మెకానికల్, ఈఈఈ బ్రాంచ్(కోర్సుల్లో) స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలని కోరారు. వివరాలకు skucet.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.


అర్ధరాత్రి తర్వాత ఆర్డర్స్..!

- 23న రాత్రి 12.45 గంటల తర్వాత బదిలీ ఉత్తర్వులు
- చీకటి ఉత్తర్వుల వెనుక వసూళ్ల శక్తులు
- కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్లడంతో హడావుడి
- వాట్సాప్ గ్రూపుల్లో ఉత్తర్వు కాపీలు
- జిల్లా కేంద్రంలోనే అడ్డగోలు పాలన
- 'కాసు'క్కూర్చునోళ్లకు దగ్గరలో.. కానివారికి దూరంగా పోస్టింగ్..
- జడ్పీలో ఇష్టారాజ్యంగా బదిలీలు
- నేటికీ ఉత్తర్వులు ఇవ్వని వైనం
- పోస్టులో పంపుతారట..!
- కోర్టును ఆశ్రయించే యోచనలో బాధితులు

అనంతపురం విద్య, సెప్టెంబరు 24: బదిలీ ఆర్డర్స్ అర్ధరాత్రి తర్వాత బయటకొచ్చాయి. తమ అక్రమాలు, మామూళ్లు ఎక్కడ బయట పడతాయోనని, బాధితులు ఎక్కడ నిలదీస్తారోనని అర్ధరాత్రి 12.45 గంటల తర్వాత ఉత్తర్వులు పంపారు. పైగా కొన్నింటిలో సంతకాలు కూడా లేవు. ఈ పరిణామాలు చాలు.. జిల్లా పరిషత్‌లో ఉన్నతాధికారులు ఏ తరహాలో బదిలీల్లో అక్రమాల బాగోతం నడిపారో అర్థం చేసుకోడానికి. వందలాది మంది ఉద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతూ...కొందరు ఉన్నతాధికారులు, సిబ్బంది చేసిన అవినీతి బాగోతాన్ని చీకటి మాటున బాగానే రక్తి కట్టించారు. లక్షలాది రూపాయలు వసూలు చేసి... సొమ్ము చేసుకుని జడ్పీలో కొందరు ఉన్నతాధికారులు, వసూల్ రాజాలు ఇష్టారాజ్యంగా సామాన్య ఉద్యోగులను బదిలీల ఉత్తర్వులకు బలి చేశారు. ఈ బాగోతం 23వతేదీ రాత్రి తర్వాత జిల్లా కలెక్టర్ వరకూ వెళ్లినట్లు తెలిసింది. దీంతో అర్ధరాత్రి 12.45 గంటల తర్వాత హడావుడి చేశారు. ఆగమేఘాల మీద పాత తేదీలతో (21వతేదీ) సీఈఓ ఓబుళమ్మ సంతకాలతో కొన్ని, సంతకాలు లేకుండా మరికొన్ని, ఇంకా కొన్ని సీఈఓ తరపున (ఫార్ సీఈఓ) అంటూ ఉత్తర్వులు బయటకు పంపారు. మొత్తానికి జడ్పీ బదిలీలను గందరగోళం, ఇష్టారాజ్యంగా చేశారు. దీనిపై బాధిత ఉద్యోగులు భగ్గుమంటున్నారు. బదిలీ గడువు ముగిసినా... ఇప్పటి వరకూ ఉత్తర్వులు ఉద్యోగుల చేతికి ఇవ్వలేదు. తర్వాత పనిచేస్తున్న ప్రాంతానికి పోస్టులో పంపుతామని చెప్పారట. ఈ అక్రమాలపై కొందరు బాధితులు.. హైకోర్టును ఆశ్రయించే పనిలో ఉన్నారు. మరికొందరు కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడానికి సిద్ధమయ్యారు. మరి కలెక్టర్ ఈ అక్రమార్కుల పట్ల ఎలాంటి చర్యలు తీసుకుంటారో.. బాధితులకు ఎలా న్యాయం చేస్తారో చూడాలి.

బదిలీలు.. బాధలు..

ఉద్యోగులు ఇబ్బందులు పడకూడదన్నదే సాధారణ బదిలీల వెనుక ఉద్దేశం. ప్రభుత్వం బదిలీలపై నిషేధాన్ని ఎత్తేసి, ఉద్యోగులకు సాధారణ బదిలీలు నిర్వహిస్తోంది. పిల్లల చదువులు, తల్లిదండ్రుల ఆరోగ్య భద్రత, ఉద్యోగుల ప్రాంతీయ సమస్యలు, స్పౌజ్, హెల్త్ గ్రౌండ్స్ ఇలా అనేక కోణాల్లో ఉద్యోగుల సౌలభ్యం కోసం నిబంధనల్లో వెసలుబాట్లు కల్పించి సాధారణ బదిలీలు నిర్వహిస్తారు. ప్రభుత్వ ఉద్దేశాన్ని కొందరు ఉన్నతాధికారులు, స్వార్థపరులు డబ్బుకు కక్కుర్తి పడి నీరుగారుస్తున్నారు. ఏఓ, సీనియర్, జూనియర్ అసిస్టెంట్ తదితర పోస్టులు అనంతపురంలోని జడ్పీ కార్యాలయంతోపాటు జిల్లాకు దగ్గరగా ఉండే మండలకేంద్రాల్లోని ఎంపీడీఓ ఆఫీసుల్లో పోస్టింగ్ ఇచ్చేందుకు బేరాలు నడిపారు. రూ.లక్షలు మింగేసి... ఉద్యోగులను ఇష్టారాజ్యంగా బదిలీ చేశారు.



ఉన్నతాధికారి సంతకమే లేకుండా బయటకు వచ్చిన ఆర్డర్ కాపీ

ఆలస్యం ఎందుకో..?

బదిలీ ఉత్తర్వులు 22వ తేదీ మధ్యాహ్నానికి ఇవ్వాల్సి ఉంది. భారీగా గోల్‌మాల్‌కు తెరలేపిన కొందరు ఉన్నతాధికారులు, పాలకులు, కిందిస్థాయి వసూల్‌రాయుళ్లు.. బదిలీల తంతును నోట్ల కట్టలు కొట్టే కామధేనువుగా మార్చుకున్నారు. అందుకే ఆలస్యంమీద ఆలస్యం చేశారు. 23వ తేదీ ఉదయం నుంచి రాత్రివరకూ ఉత్తర్వుల కోసం ఉద్యోగులు పడిగాపులు కాసేలా చేశారు. తీరా రాత్రికి జడ్పీలో సాగుతున్న అక్రమాలు జిల్లా కలెక్టర్ దృష్టికెళ్లాయి. దీంతో ఆర్డర్స్ ఇవ్వకుంటే... ఇరుక్కుపోతామని వెంటవెంటనే హడావుడి చేశారు. 23వ తేదీ అర్ధరాత్రి 12.45 గంటల తర్వాత నుంచి ఆర్డర్స్ సంతకాలతో కొన్ని, లేకుండా మరి కొన్ని పీఆర్, జడ్పీ ఉద్యోగుల వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేశారు. బదిలీల గందరగోళంపై జడ్పీ సీఈఓ ఓబుళమ్మ, ఇతర ఉన్నతాధికారులపై కలెక్టర్ అసహనం వ్యక్తంచేసినట్లు చర్చ నడుస్తోంది. తర్వాత 24వ తేదీ ఉదయం కూడా ఉద్యోగులకు బదిలీల ఉత్తర్వులు ఇవ్వలేదు. వాళ్ల పనిచేసే ప్రాంతాలు, ఆఫీసులకు పోస్టు ద్వారా ఉత్తర్వులు పంపుతామని సమాచారం చేరవేశారు. మొత్తంగా జడ్పీ బదిలీల్లో అక్రమ బాగోతంపై ఉద్యోగులు మండిపడుతున్నారు.

అక్టోబరు 2లోగా సవరించేరా..?

బదిలీ అయిన ఉద్యోగులను అక్టోబరు 2వ తేదీ రిలీవ్ చేయరని సమాచారం. పింఛన్ పంపిణీ ఇతర కారణాల వల్ల బదిలీ అయిన వారికి ఉత్తర్వులిచ్చినా... ఎవరినీ రిలీవ్ చేయవద్దంటూ పై నుంచి మౌఖిక ఆదేశాలు వచ్చినట్టు తెలిసింది. ఒకే స్టేషన్‌లో రెండు, మూడు సంవత్సరాలుగా పనిచేస్తున్న వారిని సైతం బలవంతంగా బదిలీ చేశారు. చాలా అక్రమాలే జరిగాయి. దీనిపై బాధిత ఉద్యోగులు.. జిల్లా కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు. మరి కొందరు హైకోర్టును ఆశ్రయించనున్నారు. 2వ తేదీ వరకు ఉద్యోగులను రిలీవ్ చేయకూడదన్న ఆదేశాల నేపథ్యంలో మరోవారం వరకూ గడువు ఉంది. మరి ఈలోగానైనా చేసిన అక్రమాలు సరిదిద్దుకుంటారా...? వసూళ్లు చేసిన సొమ్ము... జేబుల్లో నింపుకున్న కొందరు అధికారులు కళ్లు మూసుకుని ఇవన్నీ మామూలే అంటూ మసులుతారో చూడాలి. బాధితులు మాత్రం పంచాయతీ రాజ్ శాఖ మంత్రి, ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్‌కు, ఆ శాఖ ఉన్నతాధికారులకు ఇక్కడి అక్రమాలు చేరవేస్తున్నారు. ఏం జరుగుతుందోనని జిల్లాపరిషత్‌లో ఉత్కంఠ నెలకొంది.



అర్ధరాత్రి తర్వాత వాట్సాప్ గ్రూపుల్లో ఉత్తర్వులు

ఆరోగ్య ప్రదాత ఫార్మసిస్ట్

- కీలకపాత్రధారులైనా చిన్నచూపే
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని ఒత్తిడి
- నేడు ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం

అనంతపురం టౌన్, సెప్టెంబరు 24: నేటి ప్రపంచంలో మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే ఔషధాలపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఆరోగ్యం కోసం ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు. ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా ఏదో ఒకమందును వాడడం పరిపాటిగా మారింది. ఆరోగ్య పరిరక్షణలో ఔషధాలే కీలకం. అవి లేకుండా రోగాలకు చికిత్సలేదు. డాక్టర్ వ్యాధిని నిర్ధారించి మందులు సూచిస్తే.. వాటిని ఎలా వాడాలో చెప్పడంలో ఫార్మసిస్టే కీలకం. ఒక్కోసారి డాక్టర్ అందుబాటులో లేకపోతే రోగులకు ప్రాథమిక చికిత్స అందించే బాధ్యత కూడా ఫార్మసిస్ట్ తన భుజాలపై వేసుకుంటారు. ఇంతటి కీలకమైన ఫార్మసిస్టుల పాత్రను ప్రజలకు తెలియజేయడం కోసమే ప్రతి సంవత్సరం సెప్టెంబరు 25న 'ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం' నిర్వస్తున్నారు.

చిన్నచూపే..

ఆరోగ్య రంగంలో అత్యంత కీలక పాత్రధారులైన ఫార్మసిస్టులపై పాలకులు చిన్నచూపు చూస్తున్నారనే ఆవేదన వారిలో వ్యక్తమవుతోంది. చిన్నపాటి ఆసుపత్రులయినా ముగ్గురు ఫార్మసిస్టులు ఉండాలనే చట్టానికి పార్లమెంటు ఆమోదం తెలిపింది. కానీ ఇప్పటికీ ఫార్మసీ చట్టం అమలు కావడంలేదు. ప్రపంచంలో రోజురోజుకు కొత్త రోగాలు, వైరస్‌లు జనంపై పడి ప్రాణాలు తీస్తున్నాయి. ఆ రోగాలను అంతమొందించడానికి మందులను తయారు చేయడంలోను, వాటి నివారణ మార్గాలు కనుక్కోవడంలోను ఫార్మసిస్టుల పాత్ర కీలకం. ఔషధాల నాణ్యతను పర్యవేక్షించడం, నిల్వ చేయడం, వినియోగంపై రోగులకు సూచనలు ఇవ్వడంలో ఫార్మసిస్టులదే ప్రధాన పాత్ర. ఆసుపత్రుల్లో రోగులకు అనుగుణంగా ఫార్మసిస్టులను నియమించడంలేదు. ఏళ్లబడి పనిచేస్తున్నా పదోన్నతులు దక్కడంలేదు. దీంతో చివరకు చిరుద్యోగులుగానే పదవీ విరమణ చేయాల్సి వస్తోందని వాపోతున్నారు.

పని ఒత్తిడి..

అనంతపురం జిల్లాలో ఫార్మసిస్టుల పరిస్థితి దుర్భరంగా ఉంది. అధికారిక లెక్కల ప్రకారం వైద్యశాఖ పరిధిలో 45 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 25అర్బన్ పీహెచ్‌సీలు ఉన్నాయి. డీసీహెచ్ఎస్ కింద సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు కలిపి 11 ఉండగా, డీఎంఈ కింద జిల్లా సర్వజన ఆసుపత్రి, సూపర్‌స్పెషాలిటీ, క్యాన్సర్ యూనిట్ ఉన్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 27 మంది మాత్రమే రెగ్యులర్ ఫార్మసిస్టులు ఉన్నారు. 18 మంది కాంట్రాక్ట్ ఫార్మసిస్టులు పనిచేస్తున్నారు. అర్బన్ పీహెచ్‌సీలలో ఎన్‌హెచ్ఎం కింద 25 మంది కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒక్కరే పనిచేయాల్సి ఉంటుంది. రాత్రి పనిచేసే ఆసుపత్రులలో ఫార్మసిస్టుల బాధలు వర్ణణాతీతం. కనీసం క్యాజువల్ లీవ్ తీసుకోవడానికి కూడా అవకాశం లేకుండా పోతోందని వాపోతున్నారు. ఇక జిల్లా సర్వజన ఆసుపత్రికి రోజుకు రెండువేల మంది రోగులు వస్తున్నారు. ఇక్కడ కనీసం 20 మంది ఫార్మసిస్టులు ఉండాలి, కానీ 10మంది మాత్రమే ఉన్నారు. ఇందులో కూడా కొందరిని సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రికి పంపించారు. పగలు ఫార్మసీ విద్యార్థుల ద్వారానే మందులు ఇస్తున్నారు. రాత్రిపూట ఒక్కరినే ఉంచడంతో ఇబ్బందులు పడుతున్నారు. సూపర్‌స్పెషాలిటీలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. రోజూ 400 నుంచి 600మంది వరకు రోగులు వస్తున్నారు. వందల రకాలు మందులు అందుబాటులో ఉంటాయి. వాటిని రోగులకు అందించడానికి తగినంత మంది ఫార్మసిస్టులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలోని ఔషధాల కేంద్రం

మా కష్టానికి గుర్తింపు లేదు



నేను 31సంవత్సరాలుగా ఫార్మసిస్టుగా పనిచేస్తున్నా. అప్పుడు 50 నుంచి 60రకాల మందులు మాత్రమే అందుబాటులో ఉండేవి. ఇపుడు 600 నుంచి 700 వరకు వివిధ రకాల మందులు అందుబాటులోకి వచ్చాయి. అందుకు తగ్గట్టుగా డాక్టర్లు రాసిన మందులను రోగులకు అందిస్తున్నాం. ఏ మందులు ఎలా వాడాలో కూడా చెబుతున్నాం. రోగులు, మందులు సంఖ్య పెరిగినా ఫార్మసిస్టుల సంఖ్య మాత్రం పెరగలేదు. నిబంధనల మేరకు ఫార్మసిస్టులను నియమించాలి.

- నరసింహారావు, ఫార్మసిస్ట్, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి

పని ఒత్తిడితో సతమతం



విపరీతమైన పని ఒత్తిడితో సతమతమవుతున్నాం. ఈ టెన్షన్లకు అనతికాలంలోనే బీపీలు, షుగర్ వచ్చే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం పీహెచ్‌సీలలో 172రకాల మందులను ఫార్మసిస్టు నిర్వహించాల్సి ఉంది. రోగులకు ఏ మందులు, ఎంతడోస్ ఇస్తున్నామనే అన్ని వివరాలు పోర్టల్‌లో నమోదు చేయాలి. టీకాల వ్యాక్సిన్ టెంపరేచర్ కూడా చూడాల్సి ఉంటుంది. మహిళా ఫార్మసిస్టులం చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఈ కష్టాలు తీరాలంటే ప్రతి పీహెచ్‌సీకి అదనంగా మరో ఫార్మసిస్టును నియమించాలి.

-సరస్వతి, ఫార్మసిస్టు, పీహెచ్‌సీ, నార్పల

ఉద్యోగోన్నతులు కల్పించాలి



ఆరోగ్యశాఖలో ఫార్మసిస్టులు కీలకమైనా సరైన గుర్తింపు ఇవ్వడంలేదు. 30ఏళ్లుగా ఒకే కేడర్‌లో పనిచేస్తూ పదవీ విరమణ పొందుతున్నాం. డీఎంహెచ్ఓ పరిధిలోని మలేరియా, క్షయ విభాగం, డ్రగ్స్ స్టోర్‌తోపాటు డీసీహెచ్ఎస్, డీఎంఈ వైద్య శాఖల జోన్ల పరిధిలోనూ అనేక సీనియర్ ఫార్మసిస్ట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆరోగ్యశాఖలో అన్ని కేడర్లకు పదోన్నతులు ఉన్నాయి. మాకు మాత్రం లేకపోవడం బాధాకరం. ప్రభుత్వం మా కష్టాన్ని గుర్తించి పదోన్నతులు కల్పించి, అన్నింటా రెగ్యులర్ ఫార్మసిస్టులను నియమించాలి.

- మాధవ్, జిల్లా అధ్యక్షుడు, ఫార్మసిస్టుల సంఘం

రెండిళ్లలో చోరీ

రూ.2.20లక్షల నగదు, 17 తులాల బంగారం అపహరణ

తాడిపత్రి, సెప్టెంబరు 24: మండలంలోని ఇగుడూరు గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున నారాయణస్వామియాదవ్, సూర్యనారాయణయాదవ్ ఇళ్లల్లో దొంగలు చొరబడి రూ.2.20లక్షల నగదు, 17తులాల బంగారం దోచుకెళ్లారు. బాధితుల వివరాల మేరకు.. నారాయణస్వామియాదవ్, సూర్యనారాయణయాదవ్, ఆదినారాయణయాదవ్ అన్నదమ్ములు. వీరు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆదినారాయణయాదవ్ కుటుంబ సభ్యులతోపాటు అన్నదమ్ములను తీసుకొని సోమవారం హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. రెండిళ్లల్లో ఎవరూ లేకపోవడాన్ని గమనించిన దొంగలు తెల్లవారుజామున నారాయణస్వామియాదవ్, సూర్యనారాయణయాదవ్ ఇళ్ల లోపలికి ప్రవేశించారు. నారాయణస్వామి బీరువాలో ఉన్న రూ.2లక్షల నగదు, 15తులాల బంగారం నగలను దోచుకెళ్లారు. అదే విధంగా సూర్యనారాయణ ఇంటిలో ఉన్న రూ.20వేలు నగదుతోపాటు 2తులాల కమ్మలు, వెండి గొలుసులు, జుంకీలు, ఉంగరాలు దోచుకెళ్లారని తెలిపారు. ఆదినారాయణస్వామి ఇంట్లో ఉన్న తల్లి సుబ్బలక్షుమ్మ ఉదయం 11గంటల సమయంలో నారాయణస్వామి, సూర్యనారాయణ ఇళ్లల్లో ఫ్యాన్ వేసి ఉండడం గమనించింది. దొంగతనం జరిగినట్లు గుర్తించింది. వెంటనే కుమారులకు ఫోన్‌ద్వారా సమాచారం చేరవేసింది. దీంతో వారు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. సీఐ శివగంగాధర్ రెడ్డి, ఎస్ఐ కాటయ్యలు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేస్తామని సీఐ తెలిపారు.

రేపు స్వచ్ఛతా హీ సేవపై విద్యార్థులకు పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 24: స్వచ్ఛతా హీ సేవాపై ఈనెల 26న ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జేఎన్‌టీయూ రోడ్డులో ఉన్న సైన్సుసెంటర్‌లో ఉదయం 10గంటలకు విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నట్లు ఆ శాఖ ఈఈ మునిప్రసాద్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ ప్రైవేటు ఇతర యాజమాన్యాల పాఠశాలల్లో చదువుతున్న 8, 9, 10వ తరగతుల విద్యార్థులు పోటీలకు అర్హులన్నారు. 'గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛతా హీ సేవ అమలు-సవాళ్లు' అనే అంశంపై 45 నిమిషాల వ్యవధిలో వ్యాసరచన పోటీలు ఉంటాయన్నారు. 'వ్యర్థ రహిత ఇండియా స్థాపనలో యువత పాత్ర' అనే అంశంపై 5 నిమిషాల కాలవ్యవధిలో వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామన్నారు. 'స్వచ్ఛతాహీ సేవలో కమ్యూనిటీ భాగస్వామ్యం'పై 60 నిమిషాల్లో పోస్టర్లు తయారు చేయాలని, ప్రజల్లో అవగాహన కల్పించే అంశంపై 5 నిమిషాల లఘుచిత్రాన్ని నిర్మించాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబరు 9441823923ను సంప్రదించాలని కోరారు.

పీఆర్ ఎస్ఈ జహీర్ అస్లాం బాధ్యతల స్వీకరణ

అనంతపురం సిటీ, సెప్టెంబరు 24: ఉమ్మడి జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ ఎస్ఈగా జహీర్ అస్లాం మంగళవారం సాయంత్రం ఆ శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. దీంతో ఇన్‌చార్జి ఎస్ఈగా పనిచేస్తున్న కేవీకేవీ ప్రసాద్ నూతన ఎస్ఈకి బాధ్యతలు అప్పగించారు. నూతన ఎస్ఈగా బాధ్యతలు స్వీకరించిన జహీర్‌కు పలువురు అధికారులు, ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

అనంతపురం డీఎస్పీగా శ్రీనివాసులు...

అనంతపురం క్రైం, సెప్టెంబరు 24: పట్టణ డీఎస్పీ శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు డీఎస్పీగా పనిచేస్తున్న టీవీవీ ప్రతాప్‌ను ఏసీబీకి బదిలీ చేశారు. ఆయన స్థానంలో వెయిటింగ్‌లో ఉన్న డీఎస్పీ శ్రీనివాసులను నియమించారు. బాధ్యతలు చేపట్టిన నూతన డీఎస్పీకి సీఐలు, ఎస్ఐలు శుభాకాంక్షలు తెలియజేశారు.

రూరల్ సబ్‌రిజిస్ట్రార్‌గా శ్రీరాములు...

అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్‌గా శ్రీరాములు బాధ్యతలు చేపట్టారు. వెయిటింగ్‌లో ఉన్న ఆయనను తాజా బదిలీల్లో అనంతపురం రూరల్‌కు కేటాయించారు. ఇదివరకు టీజీ రెడ్డి కొనసాగారు.

నగరపాలికలో ఏఈలు, డీఈల బదిలీలు

అనంతపురం నగరపాలికలో పలువురు ఏఈలు, డీఈలను బదిలీ చేశారు. ఏఈ శంకర్‌ను హిందూపురం మున్సిపాలిటీకి, డీఈ శేఖర్‌ను పుట్టపర్తికి, డీఈ చంద్రశేఖర్‌ను కడప కార్పొరేషన్‌కు బదిలీ చేశారు. డీఈ రవీంద్రరెడ్డిని పబ్లిక్‌హెల్త్‌కు బదిలీచేశారు. కడప కార్పొరేషన్ నుంచి డీఈ రాజేష్‌ను, పుట్టపర్తి నుంచి డీఈ నరసింహమూర్తి, తాడిపత్రి నుంచి డీఈ వెంకటసుబ్బయ్య, పబ్లిక్ హెల్త్ నుంచి డీఈ కె సత్యనారాయణను నగరపాలికకు బదిలీ చేశారు. అలాగే ధర్మవరం నుంచి ఏఈ హరీ‌ష్‌కుమార్‌ను ఇక్కడకు బదిలీ చేశారు.

నేడు చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 24: జన విజ్ఞాన వేదిక(జేవీవీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా బుధవారం పాఠశాల స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు సాకేభాస్కర్ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఇందులో భాగంగా రాప్తాడు మండలంలోని హంపాపురం, గొందిరెడ్డిపల్లి, మరూరు, బండమీదపల్లి, జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, విన్సెంట్ డీపాల్ స్కూల్, ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బా విద్యాలయాల్లో ఉదయం 10గంటలకు 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు పరీక్ష ఉంటుందని తెలిపారు.

ఏడు మండలాల్లో వర్షం

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 24: జిల్లాలోని ఏడు మండలాల్లో సోమవారం రాత్రి వర్షం పడింది. అత్యధికంగా కళ్యాణదుర్గంలో 41.2 మి.మీ వర్షపాతం నమోదైంది. శెట్టూరు 38.8, పెద్ద వడుగూరు 14.2, కూడేరు 7.4, బ్రహ్మసముద్రం 6.2, యాడికి 3.2, పుట్లూరు 1.0 మి.మీ వర్షపాతం నమోదైంది. మంగళవారం అనంతపురం, బొమ్మనహాల్ తదితర ప్రాంతాల్లో చిరుజల్లులు పడ్డాయి.

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

● ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 24 : రైతుల సమస్యలపై ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. 2023 ఖరీఫ్, రబీలో తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పడి రైతులు సాగుచేసిన పంటలకు పూర్తిగా నష్టం వాటిల్లిందన్నారు. ఆ రైతులకు పంటబీమా ప్రకటించాలని, కౌలు రైతులకు గుర్తింపుకార్డులు ఇవ్వాలన్నారు. కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాలో రైతులు, కూలీలు, కౌలు రైతులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రైతు సూర్యనారాయణ కుటుంబాన్ని ఆదుకోవాలి

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 24 : రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో మృతి చెందిన రైతు సూర్యనారాయణ కుటుంబాన్ని రాష్ట్రప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గార్లదిన్నె మండలానికి చెందిన రైతు సూర్యనారాయణకు బూదేడు వద్ద 1.54 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమికి సం బంధించి తనకు పట్టాదారు పాసుపుస్తకం కోసం పలుమార్లు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఇదే సమస్యపై సోమవారం కలెక్టరేట్‌లో అర్జీ ఇచ్చేందుకు వచ్చి ఆవరణలోనే పురుగులమందు తాగాడన్నారు. సూర్యనారాయణ మృతికి ప్రభుత్వం బాధ్యత వహించి, ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. పట్టాదారు పాసుపుస్తక సమస్యను పరిష్కరించి, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఎంతమంది రైతులను బలి తీసుకుంటారు?: సాకే హరి

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 24 : భూముల ఆన్‌లైన్ నమోదు పేరుతో మోసాలకు పాల్పడుతూ ఎంతమంది రైతుల ప్రాణాలను హరిస్తారని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి రెవెన్యూ అధికారులను నిలదీశారు. గార్లదిన్నె మండలానికి చెందిన రైతు సూర్యనారాయణ సోమవారం కలెక్టరేట్‌లో ఆత్మహత్య చేసుకుని మృతిచెం దిన ఘటనపై మంగళవారం జేఏసీ ఆధ్వర్యంలో డీఆర్వో కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం డీఆర్వో రామకృష్ణారెడ్డికి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

నార్పల, సెప్టెంబరు 24: యువమోర్చా నాయకుడు నాగేంద్ర ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలో ప్రపంచ చిత్రపటంలో దేశం అగ్రస్థానానికి చేరుకుంటుందని తెలిపారు. అనంతరం పలువురు బీజేపీ సభ్యత్వాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శివ, సంజీవరాయుడు, పూలరాజేష్, రంగనాయకులు, దిలీపురాజు, కాశీవిశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తూంచెర్ల వాసి మృతి


బాలకృష్ణ (ఫైల్)

కనగానపల్లి, సెప్టెంబరు24: మండలంలోని తూంచెర్ల గ్రామానికి చెందిన బాలకృష్ణ (38) బెంగళూరులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు జయరాజ్ కుమారుడు బాలకృష్ణ బెంగళూరులో ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఉద్యోగానికి వెళ్లి తన గదికి వెళ్లడానికి బస్సు ఎక్కేందు కోసం రోడ్డుదాటుతుండగా ఓ గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలకృష్ణ అక్కడిక్కడే మృతిచెందాడు. ఆయన అంత్యక్రియలను మంగళవారం స్వగ్రామమైన తూంచెర్లలో నిర్వహించారు. మృతుడికి భార్య అంజలితో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ మండలకన్వీనర్ యాతంపోతలయ్య గ్రామస్థులు, హరి, చెన్నప్ప, నరసప్ప, ఆదెప్ప తదితరులు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

నార్పల, సెప్టెంబరు 24: మండల పరిధిలోని నాయనపల్లిలో మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఓ ఇల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన అశ్వత్థ దంపతులు ఉదయం కూలి పనులకు వెళ్లారు. ఆ సమయంలో టీవీ స్విచ్ వద్ద విద్యుత్ తీగలు షార్ట్ సర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల వారు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అప్పటికే ఇంట్లోలోని వస్తువులు కాలిబూడిదయ్యాయి. ఇంట్లో ఉన్న టీవీ, బీరువాలో ఉన్న రూ. 30వేలు, బట్టలు, బియ్యం పూర్తిగా దగ్ధమయ్యాయని, సుమారు రూ.1.70లక్ష నష్టం వాటిలినట్లు బాధితుడు తెలిపాడు. వీఆర్వో సాగర్, పంచాయతీ అధికారులు పరిశీలించారు. నష్టాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

దేశసేవలో భాగస్వామ్యమే ఎన్ఎస్ఎస్ లక్ష్యం

● సెంట్రల్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎస్ఏ కోరి


సెంట్రల్ యూనివర్సిటీలో పరిసరాలను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 24 : విద్యార్థులను దేశసేవలో భాగ స్వామ్యం చేయడమే జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) ఏర్పాటు లక్ష్యమని సెంట్రల్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎస్ఏ కోరి పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ డేను పురస్కరించుకుని జిల్లాలోని పలు విద్యాసంస్థల్లో మంగళవారం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. సెంట్రల్ యూనివర్సిటీ ఆవరణంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు చెత్తాచెదారాన్ని తొలగించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ద్వారా ఉచిత సేవలందిస్తున్నట్లు తెలిపారు.

జేఎన్‌టీయూలో... ఎన్ఎస్ఎస్ వేడుకల్లో రక్త నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, ప్రోగ్రామ్ ఆఫీసర్ మమత పాల్గొన్నారు.

అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో... ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉత్తమ సేవలందించిన వాలంటీర్లను అభినందించి సత్కరించారు. అనంతరం మొక్కలునాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామమూర్తి, నైపుణ్యశిక్షణ విభాగాధిపతి సురేంద్రనాయుడు, ప్రోగ్రాం ఆఫీసర్ ఖలీల్‌బాష పాల్గొన్నారు.

ఎస్కేయూలో... ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కందుకూరు ప్రభుత్వ పాఠశాలలో ప్లాస్టిక్ నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ఎన్ఎస్ఎస్ అక్షరాల వలయం ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ సోమశేఖర్, ప్రోగ్రాం ఆఫీసర్ జ్యోష్ణ పాల్గొన్నారు.

ఐటీఐలో... స్థానిక ప్రభుత్వ బాలుర ఐటీఐలో హెచ్ఐవీ నిర్మూలనపై అవగాహన కల్పించారు. 'సంపూర్ణ ఆరోగ్య ఆంధ్రను సాధిద్దాం' అంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞచేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామమూర్తి, హెచ్ఐవీ నివారణ సంస్థ ప్రతినిధులు షంషాద్ తదితరులు పాల్గొన్నారు.


అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు సన్మానం

పంట వివరాలు నమోదు చేయించండి

● జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఉమామహేశ్వరి



పొలం పిలుస్తోంది కార్యక్రమం పోస్టర్లు విడుదల చేస్తున్న జేడీ

అనంతపురంరూరల్, సెప్టెంబరు24: ఖరీఫ్‌లో సాగు చేసిన పంట వివరాలు నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి(జేడీఏ) ఉమామహేశ్వరి రైతులకు సూచించారు. రూరల్ మండలంలోని ఇటుకలపల్లి, ఎ నారాయణపురం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జేడీ రైతులు సాగు చేసిన వేరుశనగ, వరి పంటలను పరిశీలించారు. పంటసాగు గురించి రైతులకు వివరించారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంట వివరాలు నమోదు చేయడంతో పాటు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. అనంతరం కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డులు అందజేశారు. నారాయణపురంలో ప్రత్యామ్నాయ విత్తనాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఓ శశికళ, సిరికల్చర్ ఆఫీసర్ ఓబులేసు, జేడీ కార్యాలయం టెక్నికల్ ఏఓ రాకేష్‌నాయక్, ఏఈఓ మురళీకృష్ణ, గ్రామ ఉద్యాన శాఖ సహాయకులు హేమా, పావని, పశువర్ధకశాఖ అసిస్టెంట్ నరేష్, రైతు సేవ కేంద్రం సహాయకులునాగలత, తదితరులు పాల్గొన్నారు.

నార్పల/రాప్తాడు: నార్పల మండల పరిధిలోని నడిమిదొడ్డి, నాయనపల్లిలకు చెందిన పొలాల్లో వ్యవసాయ శాఖ, పశువైద్యశాఖ అధికారులు మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి చిన్నవీరాస్వామి, పశువైద్యుడు గోవిందురాజులు, సర్పంచు మల్లేశ్వరి, రెడ్డిపల్లి శాస్త్రవేత్త శశికళ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల వ్యవసాయాధికారి శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాప్తాడు మండలంలోని మరూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీఈఓ హర్ష, రైతులు పాల్గొన్నారు.

సర్వీస్ పీజీ సీట్ల కోటా తగ్గించడం దుర్మార్గం

● రోడ్డెక్కి ఆందోళన చేపట్టిన పీహెచ్‌సీ డాక్టర్లు

అనంతపురం టౌన్, సెప్టెంబరు24 : సర్వీస్ పీజీసీట్ల కోటా తగ్గించడం దుర్మార్గమని పీహెచ్‌సీల డాక్టర్లు మండిపడ్డారు. ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 85ను రద్దుచేసుకోవాలని వారు నాలుగురోజులుగా జిల్లా కేంద్రంలో నిరసనదీక్ష చేపడుతున్నారు. ఇందులో భాగంగా మంగళవారం డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద రోడ్డెక్కి ఆందోళన కొనసాగించారు. వీరి ఆందోళనకు పలువురు సీనియర్ డాక్టర్లు, వైద్యఉద్యోగులు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా డీఎంహెచ్ఓ కార్యాలయంలో పనిచేస్తున్న డాక్టర్లకు, సిబ్బందికి బీపీ, షుగర్ పరీక్షలు చేస్తూ తమ నిరసన తెలిపారు.

రోగుల పట్ల నిర్లక్ష్యం వద్దు : సూపరింటెండెంట్

అనంతపురం టౌన్ : ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న రోగుల పట్ల నిర్లక్ష్యం చేయకుండా వైద్యసేవలు అందించాలని డాక్టర్లు, సిబ్బందిని సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు ఆదేశించారు. ఆస్పత్రిలోని ఎంఎం వార్డులను సూపరింటెండెంట్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగుల వద్దకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఒక పేషెంట్ తన కాళ్లకు కట్టుకట్టి మూడురోజులైందని తెలుపడంతో పక్కనే ఉన్న డాక్టర్‌ను పిలిచి కట్టుకట్టించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఎంఓలు డాక్టర్ పద్మజ, డాక్టర్ హేమలత, నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

తిరుమల ప్రతిష్టను దెబ్బతీసేలా వైసీపీ పాలన

● జనసేన నాయకురాలు పెండ్యాల శ్రీలత

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 24: తిరుమల ప్రతిష్టను దెబ్బతీసేలా వైసీపీ ఐదేళ్ల పాలన సాగిందని జనసేన పార్టీ రాయలసీమ రీజినల్ ఉమెన్ కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత మండిపడ్డారు. తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యి వాడి హిందువుల మనోభావాలకు భంగం కలిగించారని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేపట్టిన వెంకటేశ్వరస్వామి ప్రా యశ్చిత్తం దీక్షకు మద్దతుగా పెండ్యాల శ్రీలత మంగళవారం తపోవనంలోని వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని శుద్ధి చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 టెంకాయలు కొట్టి ప్రాయశ్చిత్తం కోరారు. పార్టీ లీగల్ సెల్ అధ్యక్షుడు మురళి, నాయకులు కాశెట్టి సంజీవరా యుడు, గ్రంధి దివాకర్, జక్కిరెడ్డి ఆదినారాయణ, పెండ్యాల చక్రపాణి, రొళ్ల భాస్కర్, జక్కిరెడ్డి పద్మావతి, వల్లంశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల పట్ల అప్రమత్తంగా ఉండండి: పీడీ

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు24: బాల్యవివాహాల పట్ల విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి సూచించారు. నగరంలోని శింగనమల బాలికల వసతిగృహంలో ఏబీసీడబ్ల్యూఓ రంగమ్మ ఆధ్వర్యంలో మంగళవారం బాల్యవివాహాలపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఐసీడీ ఎస్ పీడీ మాట్లాడుతూ... విద్యార్థులు వసతిగృహాల్లో వ్యక్తిగత పరిశుభ్రతను పాటిం చాలన్నారు. ఎవరైనా తల్లిదండ్రులు బాల్యవివాహాలను ప్రోత్సహించినా... బలవంతంగా పెళ్లిళ్లు చేయాలని చూస్తే వెంటనే సమీప ప్రాంతాల్లోని అధికారులకు తెలపాలన్నారు. అనంతరం హాస్టల్‌లో మినీ లైబ్రరీని ప్రారంభించారు. కార్యక్రమంలో అనంతపురం ఏబీసీడబ్ల్యూఓ సుభాషిణి, సీడీపీఓ లలిత, నోడల్ ఆఫీసర్ వనజాక్షి, నార్పల సీడీపీఓ భారతి, వార్డెన్ రాజేశ్వరి పాల్గొన్నారు.

శాశ్వత పరిష్కారం చూపండి

● దేవదాయ కమిషనర్‌కు వైకుంఠం ప్రభాకర్ చౌదరి వినతి


దేవదాయ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న ప్రభాకర్ చౌదరి

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 24: అనంతపురం పాతూరులోని చెన్నకేశవస్వామి భూముల్లో కొన్నేళ్లుగా స్థిర నివాసం ఏర్పరచుకొని నివాసముంటున్న ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపాలని దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణను టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం విజయవాడలో దేవదాయ శాఖ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. చెన్నకేశవ స్వామి ఆలయ భూముల్లో అంబారపు వీధిలో 82 ప్లాట్లు, నీరుగంటి వీధిలో 96 ప్లాట్లు, తారకరామానగర్‌లో 152 ప్లాట్లల్లో 400 కుటుంబాలకుపైగా వందేళ్లుగా స్థిరనివాసం ఏర్పరుచుకొని జీవనం సాగిస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా దేవదాయ శాఖ అధికారుల నుంచి వారికి ఒత్తిడి పెరిగిందన్నారు. పేదలకు ఇబ్బందులు లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. కమిషనర్ స్పందిస్తూ.. సీఎం చంద్రబాబు, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి తీసుకువెళ్లి శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చినట్లు ప్రభాకర్ చౌదరి తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దేవళ్ల మురళి, గోపాల్ గౌడ్, శేఖర్ నాయుడు, బోయ మంజు, రాంబాబు, వడ్డే మురళి తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు సీఎం చంద్రబాబు వరాలు

● టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 24: ముస్లింలకు సీఎం చంద్రబాబునాయుడు వరాలు కురిపించారని టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సైపుద్దీన్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఇమామ్, మౌజన్‌లకు గౌరవవేతనాలు, మసీదుల మరమ్మతుల కోసం రూ.5వేలు మంజూరు చేసేలా నిర్ణయం తీసుకున్నారన్నారు. హజ్ యాత్రకు వెళ్లే వారికి రూ.లక్ష సబ్సిడీ వర్తింపజేశారన్నారు. వక్ఫ్ బోర్డు ఆస్తులు ముస్లింలకు మాత్రమే చెందేలా, వక్ఫ్ బోర్డులో ఇతర మతస్తులను నియమించకుండా ప్రత్యేక చట్టాన్ని తీసుకొస్తామని సీఎం హామీ ఇచ్చారన్నారు. హజ్ హౌస్‌ల మరమ్మతులతో పాటు నిర్మాణాలు చేపడతామని సీఎం చెప్పారన్నారు. ముస్లిం, మైనార్టీల తరపున సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

పీవీకేకేలో ఎఫ్‌డీపీ శిక్షణ ప్రారంభం

అనంతపురం రూరల్, సెప్టెంబరు 24: పీవీకేకే ఐటీ ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం, జేఎన్టీయూఏ ఫాకల్టీ డెవలప్‌మెంట్ సెంటర్(ఎఫ్‌డీసీ)సంయుక్త ఆధ్వర్యం లో ఏఐ ఇంటిగ్రేటెడ్ గ్రీన్ వైర్‌లెస్ కమ్యూనికేషన్ అండ్ సెన్సార్ టెక్నాలజీస్‌పై ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం కళాశాలలో ప్రారంభించారు. ఎఫ్‌డీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ ప్రశాంతి హాజరై మాట్లాడారు. వైర్‌లెస్ కమ్యూనికేషన్ సెన్సార్ టెక్నాలజీలపై ఏఐ ప్రభావాన్ని వివరించారు. అభివృద్ధి చెందుతున్న రంగంలో తాజా పరిణామాలను అన్వేషించడా నికి ఎఫ్‌డీపీ ఫాకల్టీ సభ్యులకు అద్భుతమైన వేదికగా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో జేఎన్టీయూఏ ఈసీఈ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ మమత, విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్, ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ దీప్తిజోర్దానా, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, ఈసీఈ విభాగాధిపతి శ్రీరాజ్ పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.46

అనంతపురం రూరల్, సెప్టెంబరు 24: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.46తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మంగళ వారం 2100 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.36, కనిష్ఠ ధర రూ.24పలికినట్లు ఆయన తెలిపారు.

'ఎమ్మెల్యే పర్యటనను విజయవంతం చేద్దాం'


సమావేశంలో చర్చిస్తున్న ఎల్ నారాయణచౌదరి

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 24: ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత బుధవారం మండలంలో పర్యటిస్తారని టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే పర్యటనకు సంబంధించి అధికారులు, పార్టీముఖ్యనాయకులతో సమావేశమై చర్చించారు. ఉదయం 10గంటలకు ప్యాదిండి, 11-30కు ఎన్ఎస్‌గేటు, మధ్యాహ్నం ఒంటి గంటకు చెన్నే కొత్తపల్లి, 2-30కు హరియన్ చెరువు గ్రామాల్లో ఎమ్మెల్యే పాల్గొంటారని తెలిపారు. సీసీరోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తారన్నారు. ఎమ్మెల్యే పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ శ్రేణులను కోరారు. సమావేశంలో ఈఓఆర్‌డీ అశోక్‌నాయక్, టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అంకే అమరేంద్ర, మాడెం సూర్యనారాయణరెడ్డి, చెన్నకేశవులగౌడ్, అమరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి సాంకేతికతను జోడిస్తున్నాం

ఎమ్మెల్యే పరిటాల సునీత



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఆత్మకూరు, సెప్టెంబరు 24 : రాష్ట్రంలో వ్యవసాయానికి సాంకేతికతను జోడించి రైతులకు ఆధునిక వ్యవసాయాన్ని అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మండల పరిధిలోని ముట్టాల గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం ఆమే పాల్గొన్నారు. ఈ సందర్భంగా కంది పంటలో డ్రోన్ ద్వారా మందు పిచికారి చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ... వ్యవసాయాధికారులు రైతులకు అందుబాటులో ఉండి సలహాలు సూచనలు అందించాలని సూచించారు. గ్రామాల్లో ఈ క్రాప్ తప్పనిసరిగా చేయాలన్నారు. అదేవిధంగా ఆమె మండలంలో రూ. 2.60కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవ శిలాఫలకాలను ప్రారంభించారు. ముట్టాలలో రూ. 30లక్షలు, పాపంపల్లిలో రూ. 20లక్షలు, ఆత్మకూరు పంచాయతీలో రూ. 96లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. గొరిదిండ్లలో గ్రీన్‌కో సంస్థ ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను, జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆ సంస్థ సౌజన్యంతో ఏర్పాటు చేసిన మినీ సైన్సు ల్యాబ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆ పాఠశాలకు ప్రహరీ, వాటర్ ప్లాంటు , అబ్దుల్ కలామ్ విగ్రహం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రీన్‌కో అధికారులు శరత్ చంద్ర, బాలాజీ, కిషోర్, ప్రసాద్, టీడీపీ మండల టీడీపీ కన్వీనర్ శ్రీనివాసులు, ముట్టాల ఎంపీటీసీ పారిజాతమ్మ, తెలుగుయువత నారాయణస్వామి, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు పరుశురామ్, శశాంక చౌదరి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా తిరుపతి పద్మావతి వైద్యకళాశాలలో ఉచిత ఎంబీబీఎస్ సీటు సాధించిన ఆత్మకూరుకు చెందిన ప్రసాద్, సుజాత కుమార్తె నిహారికను ఎమ్మెల్యే అభినందించారు. పార్టీ కార్యాలయంలో విద్యార్థినిని సన్మానించారు.

మాది చేతల ప్రభుత్వం

ఎమ్మెల్యే దగ్గుపాటి


కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 24: మాది మాటల ప్రభు త్వం కాదని.. చేతల ప్రభుత్వమని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక లక్ష్మీనగర్‌లో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానికంగా ఇంటింటికీ తిరిగి సంబంధిత కరపత్రాలు పంపిణీ చేశారు. వంద రోజుల్లో చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. నగరాభివృద్ధి విషయంలో స్పష్టమైన ప్రణాళికలతో ఉన్నామన్నారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా తాను అందుబాటులో ఉంటానని ఆయన స్పష్టం చేశారు. నగర కమిషనర్ నాగరాజు, తహసీల్దార్ హరికుమార్, టీడీపీ నాయకులు తలారి ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, గాజుల ఆదెన్న, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, సుధాకర్ నాయుడు, కొండవీటి భావన, చేపల హరి, విశాలాక్షి, కుంచెపు వెంకటేష్, సంగా తేజస్విని, పోతుల లక్ష్మీనరసింహులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నగరంలోని ఐదో రోడ్డులో హేమంత్, జయప్రకాష్, నారాయణ, శ్రీనివాస్ గౌడ్, చలపతి, చరణ్ మిత్ర బృందం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే శ్రావణిశ్రీ


లోలూరులో మట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, సెప్టెంబరు24: రాష్ట్రాభివృద్ధి, అన్ని వర్గాల ప్రజలు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. మండలంలోని లోలూరులో మంగళవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కూటమి వంద రోజుల పాలనపై ఇంటింటా తిరుగుతూ కరపత్రాలు పంపిణి చేశారు. లోలూరులో గోకులం షెడ్, ఆకులేడు గ్రామంలో వాటర్‌షెడ్ కింద ఫారం పండ్ పనులకు భూమి పూజ చేశారు. అంగన్వాడీలు ఏర్పాటు చేసిన పౌష్టికహారం స్టాల్‌ను పరిశీలించారు. అరు పంచాయతీలకు ఉచితంగా వచ్చిన ట్రాక్టర్లను సర్పంచ్‌లకు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బ్రహ్మయ్య ఎంపీడీఓ నిర్మలకుమారి సీడీపీఓ ఉమాశంకరమ్మ ఏఓ అన్వేష్ ముమార్, టీడీపీ నాయకులు గుత్తా ఆదినారాయణ, దండుశ్రీనివాసులు, డేగలకృష్ణమూర్తి, మారుతినాయుడు, ఈశ్వర్‌రెడ్డి, షాలిని, చితంబరిదొర, చిదానందనాయుడు, అనంతచౌదరి, కొండయ్య, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.


గుమ్మేపల్లిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

శింగనమల: టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని గుమ్మేపల్లి, సీ బండమీదపల్లి, చిన్నజలాలపురంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. డేగల శ్రీనివాసులు, ప్రతాప్, చెన్నయ్య, పెద్దన్న, లింగన్న, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

అనంతపురంరూరల్: మండలంలోని ఆకుతోటపల్లిలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ రాగే మురళీమోహన్ ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. టీడీపీ నాయకులు డీసీ బాబు, అనిల్‌చౌదరి, ప్రవీణ్ గౌడ్, లక్ష్మీపతి, జయరాములు, సూర్యప్రకాష్, సచివాలయ సిబ్బంది దుర్గాప్రసాద్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


చెంద్రాచెర్లలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కనగానపల్లి: కూటమి ప్రభుత్వం వందరోజుల పాలనపై టీడీపీ నాయకులు మంగళవారం మండలవ్యాప్తంగా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేపట్టారు. నాయకులు గిరిశాల కుమార్, ధనుంజయ, నారాయణస్వామి, రవీంద్ర, జనా తదితరులు పాల్గొన్నారు.

కోన కణ్వాశ్రమం నుంచి బహిష్కరణ

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 24: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎంతో పవిత్ర పుణ్యక్షేత్రమైన కోన కణ్వాశ్రమ పవిత్రతకు భంగంగ కలిగేలా వ్యవహరిస్తున్న దత్తానంద గిరిస్వామిని కోనక్షేత్రం నుంచి బహిష్కరిస్తున్నట్లు శ్రీ మల్లికార్జునస్వామి కణ్వాశ్రమం ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. చెన్నేకొత్తపల్లి సమీపంలోని కోనలో మంగళవారం కమిటీ ప్రత్యేక సమావేశం నిర్వహించి, ఆయనను గౌరవాధ్యక్షుడిగా తొలగిస్తూ, కోన నుంచి బహిష్కరిస్తూ తీర్మానం చేసినట్లు తెలిపారు.

ఎస్‌జీఎఫ్ జిల్లా చెస్ జట్ల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 24: ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి చెస్ క్రీడాకారులు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 బాలబాలికల క్రీడాకారుల చెస్ ఎంపిక పోటీలు నిర్వహించారు. అండర్-17 బాలికల్లో శ్రీహ, మహేశ్వరి, క్లారా, విజ్ఞ, ఆసనా, బాలురలో...యేహానా, టీకా ప్రనవ్, భగీరథ, పార్థసారథి, వంశి ఎం పికయ్యారు. అండర్-14 బాలురలో... శ్యామూల్ స్టీఫెన్ నోబుల్, సహృద్, నితీష్ ప్రసాద్, దర్శన్, చోక్షా ఎంపిక య్యారు. బాలికల్లో..లాలిత్య, త్రిపాద, అంబిక, అభినేత్రి, మేఘనలు ఎంపికయ్యారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సు గుణమ్మ, కోఆర్డినేటర్లు రవీంద్రప్రసాద్, రవీంద్ర బాబు, పీడీలు చంద్రశేఖర్‌రెడ్డి, వేణు గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'లబ్ధిదారులు ఇల్లు కట్టుకునేలా చూడండి'

అనంతపురంరూరల్: మండలం పరిధిలోని లేఅవుట్లలో ఆప్షన్-1,2 లబ్ధిదారులు ఇల్లు కట్టుకునే విధంగా అవగాహన కల్పించాలని మండల అధికారులు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం 'మన ఇల్లు-మనగౌరవం' కార్యక్రమంపై మండల అధికారుల సమావేశం నిర్వహించారు.


పొలం పిలుస్తోంది కరపత్రాలను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు


ఎద్దులతో గుంటక బాస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, వెంకటశివుడుయాదవ్


దంచెర్లలో ...


75 వీరాపురంలో


ఉరవకొండ మండలంలో..


85నిట్టూరు గ్రామంలో ..

పలు ప్రాంతాల్లో పొలం పిలుస్తోంది

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం పలు ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారులు పొలాలను సందర్శించి, పంటలను పరిశీలించారు. రైతులకు సస్య రక్షణ చర్యలు, ఆధునిక వ్యవసాయ పద్ధతుల గురించి, ఆధునిక పనిముట్ల గురించి వివరించారు. కళ్యాణదుర్గంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని జెండా ఊపి ఎమ్మెల్యే ప్రారంభించారు. బొమ్మనహాళ్ మండలంలోని గోవిందవాడ గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్‌తో కలిసి రాయదుర్గం ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొలంలో ఎద్దులతో గుంటక బాశారు.

- ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్

మాజీ ఎమ్మెల్యే కుమారుడికి ఎమ్మెల్యే అమిలినేని ఆర్థిక సాయం

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 24: నియోజకవర్గ తొలి ఎమ్మెల్యే టీసీ మారెప్ప కుమారుడు సురేష్‌కు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు రూ.లక్ష సాయం అందజేశారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో మంగళవారం టీడీపీ నాయకులు, తిమ్మలాపురం గ్రామస్థులతో కలిసి మాజీ ఎమ్మెల్యే కుమారుడికి ఆర్థిక సాయాన్ని అందజేశారు. మాజీ ఎమ్మెల్యే టీసీ మారెప్ప మరణానంతరం కుటుంబ పోషణ భారంగా మారింది. కుమారుడు సురేష్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ దుర్భర పరిస్థితి తెలుసుకున్న ఎమ్మెల్యే అమిలినేని స్పందించి ఆర్థికసాయం అందించారు


నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

కేసీ హరికి సత్కారం


హరిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 24: ఏపీ మార్క్‌ఫెడ్ కమిటీ డైరెక్టర్‌గా పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కేసీ హరికి శ్రీ శంకరానందగిరి స్వామి డిగ్రీ, జూనియర్ కళాశాల సిబ్బంది మంగళవా రం సన్మానం చేశారు. ప్రిన్సిపాల్‌లు గోపాల్, వరప్రసాద్, అధ్యాపకులు కేసీ హరికి పూలమాలలు వేసి శాలువాతో సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

గుమ్మఘట్ట, సెప్టెంబరు 24: మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన బోయ నాగన్న(32) మంగళవారం రాత్రి 75 వీరాపురం తండా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతడి సోదరి నాగవేణి తీవ్రంగా గాయపడింది. నాగన్న, తన సోదరి నాగవేణితో కలిసి రాయదుర్గం నుంచి కృష్ణాపురానికి ద్విచక్రవాహనంపై వెళుతుండగా 75 వీరాపురం తండా సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. నాగన్న అక్కడిక్కడే మృతి చెందగా, గాయపడిన నాగవేణిని రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య లక్ష్మీ, ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

ద్విచక్రవాహనానికి నిప్పు

గుత్తి, సెప్టెంబరు 24: పట్టణంలోని కోట వీధికి చెందిన బేల్దారి శంకర్ ద్విచక్రవాహనానికి మంగళ వారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు. దీంతో వాహనం దగ్ధం అయ్యింది. ఇంటి ఎదుట పార్క్ చేసిన వాహనాన్ని గుర్తు తెలియని దుండగుడు నిప్పు పెడుతున్న దృశ్యాలు సమీపంలోని సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. బాధితుడు శంకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి


హాకీ కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 24: క్రీడాకారులను ప్రోత్సహిస్తే దేశానికి మంచి పేరు తెస్తారని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. స్థానిక కరణం చిక్కప్ప పాఠశాల విద్యార్థులకు గ్రీన్‌కో సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం హాకీ కిట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. నియోజకవర్గం యువకుల్లో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసి ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలకు చేరుతారన్నారు. టాయిలెట్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని పాఠశాల సిబ్బంది కోరగా గ్రీన్ కో కంపెనీ ప్రతినిధులతో చర్చించి, ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

రైతులను ముంచిన ఘనుడు జగన్: కాలవ

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

బొమ్మనహాళ్, సెప్టెంబరు 24: నల్లచట్టాలు తెచ్చి రైతులను నట్టేట ముంచిన ఘనుడు మాజీ ముఖ్యమంత్రి జగన్ అని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ విమర్శించారు. మండలంలోని గోవిందవాడ గ్రామంలో మంగళ వారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం ప్రజావేదిక కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి వందరోజుల్లో కూటమి ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేసి స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు కేశవరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్లు బలరాంరెడ్డి, హనుమంతరెడ్డి, ప్రత్యేక అధికారి తిప్పేస్వామి, తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ షకీలాబేగం, ఈఓపీఆర్డీ దాస్ పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి సేవా భావాన్ని అలవర్చుకోవాలి

రాయదుర్గంరూరల్: విద్యార్థులు విద్యతో పాటు సేవా భావాన్ని అలవాటు చేసుకోవాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం 74 ఉడేగోళం గ్రామం వద్ద ఉన్న కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కాలవ హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో స్ఫూర్తివంతమైన కార్యక్రమాల్లో ఎన్ఎస్ఎస్ ఒకటన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో టీం వర్క్ ఎలా పనిచేస్తుందో తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రఘురామమూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డీ నారాయణ, శ్రీనివాసులు, ఎన్‌సీసీ సీటీఓ కిరణ్ నక్కల, ప్రోగ్రాం ఆఫీసర్లు జీ కోదండరాములు, దొడ్డ నాగప్ప, డీ నారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

2047 నాటికి వికసిత ఆంధ్రప్రదేశ్

రాయదుర్గం: ముఖ్యమంత్రి చంద్రబాబు 2047 నాటికి వికసిత ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని ఒకటో వార్డులో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం పేదలకు అండగా ఉండేలా చర్యలు తీసుకుంటుందన్నారు. చేనేత కార్మికుల విద్యుత్ బిల్లులలో రాయితీలు ఇచ్చేలా నిర్ణయం తీసుకున్నారన్నారు. గార్మెంట్స్ పరిశ్రమలపై కూడా రాయితీలు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు.

ఇద్దరు మట్కా బీటర్ల అరెస్ట్

యాడికి, సెప్టెంబరు24: మండలకేంద్రంలో మట్కా రాస్తున్న ఇద్దరు బీటర్లను మంగళవారం అరెస్ట్‌చేసి వారి నుంచి రూ.25050 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఈరన్న తెలిపారు. వారిపై కేసు నమోదు చేశామన్నారు.

మొక్కలు నాటాలి.. న్యాయాధికారి


మొక్క నాటుతున్న న్యాయాధికారి

గుత్తి, సెప్టెంబరు 24: పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలని స్థానిక సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి కాశీవిశ్వనాథచారి పేర్కొన్నారు. పట్టణంలోని స్పెషల్ సబ్ జైలును మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఇందులో భాగంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో జైలర్ మహేశ్వరుడు, న్యాయవాదులు , కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామి రథం పరిశీలన

యాడికి, సెప్టెంబరు 24: స్థానిక చెన్నకేశవ స్వామి ఆలయ రథం భద్రతపై మంగళవారం సీఐ ఈరన్న పరిశీలించారు. రథం చుట్టూ ప్రాంతాలను పరిశీలించారు. రథం కనిపించేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

హౌసింగ్ ఏఈ బాధ్యతల స్వీకరణ

పుట్లూరు, సెప్టెంబరు24: మండల హౌసింగ్ ఏఈగా సంధ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె తాడిపత్రి మండలం నుంచి బదిలీపై మండలానికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఏఈ లోకేష్ బదిలీపై యాడికి మండలానికి వెళ్లిన విషయం తెలిసిందే.

ఏపీఎం...

తాడిపత్రి: స్థానిక ఏపీఎం కార్యాలయంలో ఏపీఎంగా వీరాస్వామి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ స్థానంలో పనిచేస్తున్న సునీత బదిలీపై రాప్తాడుకు వెళ్లడంతో గుంతకల్లులో పనిచేస్తున్న వీరాస్వామి బదిలీపై తాడిపత్రికి వచ్చారు.

పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డ ఆరోగ్యం

బెళుగుప్ప, సెప్టెంబరు 24: పౌష్టికాహారం తీసుకుంటే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని పీహెచ్‌సీ డాక్టర్ కార్తీక్‌రెడ్డి తెలిపారు. మండలంలోని గంగవరంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవం నిర్వహించి బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు.

నేడు అత్యవసర కౌన్సిల్ సమావేశం

తాడిపత్రి, సెప్టెంబరు24: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11గంటలకు అత్యవసర కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ శివరామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరుకావాలన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

తాడిపత్రి, సెప్టెంబరు24: తిరుమల లడ్డూను అపవిత్రం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ జైశ్రీరామ్ భక్తమండలి నాయకులు మంగళవారం గాంధీ సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు నిచ్చెనమెట్ల రాధాకృష్ణ మాట్లాడుతూ తిరుమల లడ్డును గత వైసీపీ ప్రభుత్వం అపవిత్రం చేసిందన్నారు. ఇది భక్తుల మనోభావాలను దెబ్బతిసినట్లే అని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పోతుల గంగాధర్‌యాదవ్, రామాంజనేయులు, భరత్, గణేష్, వీరభద్ర, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రైతుల సొమ్ము తిన్నవారిపై చర్యలు తీసుకోండి

కుందుర్పి, సెప్టెంబరు 24: మండలంలోని అపిలేపల్లి గ్రామంలో ఏర్పాటు చేసుకున్న రైతు పరస్పర సహకార సంఘంలోని నిధులు స్వాహా చేసిన వారిపై చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని స్థానిక పోలీస్ స్టేషన్‌లో గ్రామస్థులు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షులు రుక్మిణమ్మ, ఇతర సభ్యులు మాట్లాడుతూ ఆర్‌డీటీ, ప్రభుత్వ సహకారంతో రైతులకు సంక్షేమం కల్పించేందుకు రైతు పరస్పర సహకార సంఘం ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఒక్కో రైతు నుంచి రూ. 1100 లు చొప్పున సభ్యత్వ రుసుం తీసుకున్నామని, 560 మంది దాకా సభ్యత్వం పొందారన్నారు. సంఘంలో పనిచేస్తున్న యాంకర్ గంగాధరతో పాటు కొంతమంది కలిసి రూ. 11 లక్షలకు పైగా నగదును స్వాహా చేశారన్నారు. వారిపై చర్యలు తీసుకుని రైతులు చెల్లించిన సభ్యత్వ రుసుము తిరిగి చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

ట్యాంకర్ డ్రైవర్‌కు ఆర్థిక సాయం


ఖాదర్‌వలికి చెక్కును అందజేస్తున్న వెంకటేష్

గుంతకల్లు టౌన్, సెప్టెంబరు 24: పట్టణంలోని పోర్టర్ లైన్‌లో నివాసం ఉంటున్న ట్యాంకర్ డ్రైవర్ ఖాదర్‌వలికి ఆ నలుగురు సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంజుల వెంకటేష్ మాట్లాడుతూ ఖాదర్‌వలి ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తూ పక్షవాతానికి గురై ఇంటికే పరిమితమయ్యాడన్నారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకుని ఖాదర్ వలి ఇంటికి వెళ్లి రూ.10వేల చెక్కును అతనికి అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సమితి సభ్యులు మోండ్ల కేశవ, పురుషోత్తం, భాగ్యరాజు, ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల జోలికి వెళ్లరాదు

గుంతకల్లు టౌన్, సెప్టెంబరు 24: విద్యార్థులు మాదక ద్రవ్యాల జోలికి వెళ్లరాదని తాడిపత్రి డివిజన్ ఏబీసీడబ్ల్యూఓ రంగమ్మ తెలిపారు. మండలంలోని పాతకొత్త చెరువు ప్రభుత్వ బీసీ బాలుర హాస్టల్‌లో మంగళవారం మాదకద్రవ్యాలు వాడకం వలన కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చెడు అలవాట్లతో చదువును నిర్లక్ష్యం చేయరాదన్నారు. విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ ఎం ఖాదర్ హుసేన్, ఎన్‌సీసీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల బియ్యం కాజేయడం నేరం: కలెక్టర్


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బెళుగుప్ప, సెప్టెంబరు 24: లబ్ధిదారుల బియ్యం కాజేయడం నేరం, సీఎస్‌డీటీతో విచారణ చేయించి నివేదిక పంపాలని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ తహసీల్దార్ షర్మిలను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ హనకనహాళ్ వెళుతూ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పెద్దన్న, టీడీపీ నాయకులు పెద్దతిప్పయ్య, మల్లికార్జున కలెక్టర్‌కు సమస్యలు విన్నవించారు. రేషన్-2 డీలర్ లబ్ధిదారులకు బియ్యం ఇవ్వకుండా లాగిన్ వేయించి స్వాహా చేశారని ఫిర్యాదు చేశారు. సబ్సిడీపై పప్పుశనగ విత్తనాల పంపిణీ చేయాలని కోరారు. కార్యాలయం ఉండటానికి అనుకూలంగా లేదని, పీహెచ్‌సీకి నూతన భవనం నిర్మించడంతో పాత ఆస్పత్రి భవనం వృథాగా ఉంది. అందులోకి కార్యాలయ మార్పునకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది కోరారు. మీ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎంపీడీవో రామచంద్ర, డీటీ హుస్సేన్ పీరా, ఆర్ఐ నగేష్‌లు వున్నారు.

తహసీల్దార్‌కు బెదిరింపు.. వైసీపీ నాయకుడిపై కేసు

బెళుగుప్ప, సెప్టెంబరు 24: తహసీల్దార్‌ను బెదిరించిన అంకంపల్లికి చెందిన వైసీపీ నాయకుడు గోపాల్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివ మంగళ వారం తెలిపారు. ఇటీవల అంకంపల్లిలోని ఆయన రేషన్ షాపుపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించి 6ఏ కేసు నమోదు చేశారు. ఈ విషయమై కేసు వివరాలు కావాలని తహసీల్దార్ షర్మిలతో వాగ్వాదానికి దిగారు. మా మాటే వినవా.. మీ అంతు చూస్తానంటూ బెదిరించారని వీఆర్ఏ యర్రిస్వామి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఈఓ బాధ్యతల స్వీకరణ

గుంతకల్లు, సెప్టెంబరు24: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయ ఈఓగా దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనరు వాణి బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ ఈఓగా పనిచేసిన భద్రాజీ బదిలీ అయిన సంగతి తెలిసిందే. కాణిపాకం వరసిద్ధి వినాయక దేవస్థాన ఈఓగా పనిచేసిన వాణిని కసాపురం ఆలయ ఈఓగా నియమించారు. ఆమె మంగళవారం ఉదయం విధుల్లో చేరారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను కలసి విధుల్లో చేరిన విషయం తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కే సుగుణమ్మ, ఏఈఓ మల్లికార్జున, అధికారులు పీ వెంకటేశ్వర్లు, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఇసుక తరలింపునకు అనుమతించండి: సీపీఐ

గుంతకల్లు టౌన్, సెప్టెంబరు 24: పట్టణంలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించేందుకు డ్రైవర్లకు అనుమతి ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ అన్నారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం రాత్రి డీఎస్పీ శ్రీనివాస్‌తో ఆయన సమావేశం అయ్యారు. ఈసందర్భంగా జగదీష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఉచిత ఇసుకను ఇస్తామన్నారు. అయితే ఇసుక ట్రాక్టర్లు కనిపిస్తే పోలీసులు వాహనాలను స్టేషన్‌కు తరలించి కేసులు పెడుతున్నారని అన్నారు. ట్రాక్టర్ల డ్రైవర్లపై కేసులు పెట్టకుండా ఇసుకను తరలించుకునేందుకు అనుమతి ఇవ్వాలని డీఎస్పీని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు, మహేష్, గోపినాథ్, ఎస్ఎండీ గౌస్, రామాంజనేయులు యాదవ్, ఈశ్వరయ్య, చెరువునాగన్న, సురేంద్ర పాల్గొన్నారు.

ఎప్పుడైనా రావచ్చా..?

- సమయపాలన పాటించని సచివాలయ ఉద్యోగులు
- వచ్చినా ఇతర పనులపై బయటకు ..
- 'ఆంధ్రజ్యోతి' విజిట్‌లో వెల్లడి



గుంతకల్లులోని 18వ వార్డు సచివాలయానికి తాళం వేసి వెళ్లిపోయిన సిబ్బంది

గుంతకల్లు నెట్‌వర్క్, సెప్టెంబరు 24: గుంతకల్లు, ఉరవకొండ నియోజవర్గాల్లోని మండలా ల్లో పట్టణ, గ్రామ సచివాలయాల్లో ఉద్యోగులు పదిన్నరకు విధుల్లోకి వస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి పదిన్నర వరకూ ఎప్పుడైనా యాప్‌లో అటెండెన్సు థంబ్ వేయవచ్చులే అన్న చందంగా ఉద్యోగులు నింపాదిగా వచ్చి చేరుతున్నారు. ఉదయం పదికి సచివాలయాలకు వచ్చే ప్రజలు అరగంట వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంది. వచ్చి ఫేస్ అటెండెన్సు వేసిన వెంటనే ప్రభుత్వ కార్యక్రమాలున్నాయంటూ కొందరు వెళ్లిపోయారు. గుంతకల్లులో 18వ సచివాలయ సిబ్బంది ఉదయం 9-50 గంటలకు సచివాలయానికి చేరుకుని ఫేస్ యాప్ ద్వారా అటెండెన్స్ వేశారు. సోఫియా స్ట్రీట్‌లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ఉండటంతో సచివాలయానికి గడియ పెట్టి వెళ్లారు. సచివాలయంలో కనీసం ఒక్కరిని కూడా ఉంచకుండా అందరూ వెళ్లిపోయారు. ఉదయం 10-15 నిమిషాలకు స్వీపర్ సచివాలయం గడియ తీసి లోపల శుభ్రం చేసి తిరిగి గడియ పెట్టి వెళ్లిపోయారు. ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చిన ప్రజలు సచివాలయానికి గడియ పెట్టడంతో ఒక్కొక్కరుగా వచ్చి చూసి వెళ్లిపోయారు. గుత్తి మండలం మండలంలోని పెద్దొడ్డి గ్రామ సచివాలయాన్ని మంగళవారం విజిట్ చేయగా అనిమల్ హస్బెండరీ సహాయకుడు 10-10 గంటలకు, డిజిటల్ అసిస్టెంట్, ఏఎన్ఎంలు, 10-20కు వచ్చారు. మహిళా పోలీస్ 10-15కు కార్యదర్శి అందరికన్నా ఆలస్యంగా 10-25 గంటలకు హాజరయ్యారు. ఆలస్యం అయిన విషయాన్ని సిబ్బందిని విచారించగా 10-30లోపు ఎప్పుడన్నా రావచ్చు అంటూ ఫేస్ యాప్‌లను వేశారు. గుత్తి మునిసిపాలిటీ పరిధిలోని కొత్తూరు సచివాలయాన్ని సందర్శించగా విద్యా కార్యదర్శి, మహిళా పోలీసు ఉద్యోగులు తప్ప మిగిలిన వారు గుత్తి ఆర్‌అండ్‌బీ వసతి గృహంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి వెళ్లారు. పనిమీద సచివాలయానికి వచ్చినవారు వెనుదిరిగి పోయారు. ఉరవకొండ మండలంలోని చిన్నముష్టూరు సచివాల యం. 11 గంటలైనా కేవలం నలుగురు మాత్రమే హాజరయ్యారు. స్థానిక సచివాలయంలో 12 మంది ఉద్యోగులుండగా ఉదయం 10-30 గంటలకు డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు మాత్రమే హాజరయ్యారు. డిజిటల్ అసిస్టెంట్ అటెండెన్స్‌లో సంతకం చేసి బయటకు వెళ్లారు. విధుల్లో ఉండకుండా, బయట ఫోన్‌లో కాలక్షేపం చేస్తూ గడిపారు. ఈ సచివాలయ కార్యదర్శి ఉరవకొండకు కూడా ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. దీంతో వారం రోజులైనా చిన్న ముష్టూరు సచివాల యంపైపు ఆయన కన్నెత్తి చూడలేదు. విడపనకల్లు మండలంలోని చీకలగురికి గ్రామ సచివాలయాన్ని విజిట్ చేయగా సచివాలయ సిబ్బంది 10గంటలకు కార్యాలయానికి రాలేదు. 10-12 నిమిషాలకు వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, వీఏఏలు ఒక ద్విచక్రవాహనంపై వచ్చారు. ఒకరు వెళ్లి సచివాల యం తాళం తీశారు. అనంతరం ఇంజనీరింగ్ అసిస్టెంట్ 10-15కు రాగా, అనిమల్ హస్బెండరీ సహాయకుడు 10-20కి వచ్చాడు. అనంతరం 10-25కు మహిళా పోలీస్, కార్యదర్శి వచ్చారు. ఆలస్యం అయిన విషయాన్ని సిబ్బందిని విచారించగా 10-30లోపు ఎప్పుడన్నా రావచ్చు అంటూ ఫేస్ యాప్‌లో హాజరు వేశారు.